ప్రజాశక్తి

శుక్రవారం 4 జూలై 2025 8 పేజీలు

ఎన్‌టిఆర్

కృష్ణా

హెల్త్ యూనివర్సిటీ వద్ద ఆందోళన నిర్వహిస్తున్న ఎస్‌ఎఫ్‌ఐ నేతలను అరెస్టు చేస్తున్న పోలీసులు

హెల్త్ వర్సిటీ వద్ద ఉద్రిక్తత

- వైద్య విద్యార్థులపై పోలీసు జులుం
- విద్యార్థులు, సంఘాల నేతల అరెస్టు
- ఎఆర్ గ్రౌండ్స్‌కు తరలింపు

ప్రజాశక్తి - హెల్త్ యూనివర్సిటీ : విజయవాడలోని డాక్టర్ ఎన్‌టిఆర్ హెల్త్ యూనివర్సిటీ వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. పర్మినెంట్ రిజిస్ట్రేషన్ కోసం ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్స్ కొన్ని రోజుల నుండి యూనివర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్నారు. తమ సమస్యను పరిష్కరించాలని ఫారిన్ మెడికల్ గ్రాడ్యుయేట్లపై, వారి మద్దతుగా శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలపై (మిగతా 2లో)

ప్రమాదాల నడుమ ఇంజినీరింగ్ కార్మికుల బతుకులు

- దుర్వాసనలోనే వాహనాల మరమ్మతులు
- చాలీచాలని వేతనాలు... దుర్భర జీవితాలు...

ప్రజాశక్తి - విజయవాడ : దుర్భరమైన పరిస్థితుల్లో ఇంజినీరింగ్ కార్మికులు పనులు చేయాల్సి వస్తోంది. పనులు చేసే సమయంలో ప్రాణాలు పోవాల్సి వస్తోంది. చాలీచాలని వేతనాలు, కడు దుర్భరమైన జీవితాలతో, దుర్గంధపూరిత వాతావరణంలో వాహనాల మరమ్మతు పనులు చేస్తూ తీవ్రమైన అనారోగ్యాలకు ఇంజినీరింగ్ కార్మికులు గురవుతున్నారు. కార్మికులు ప్రమాదాలకు గురికాకుండా ఉండటానికి వీలుగా కనీస జాగ్రత్తలు తీసుకోవడంగానీ, సంబంధిత పరికరాలు సరఫరా చేయడంగానీ విజయవాడ నగర పాలక సంస్థ అధికారులు చేయడంలేదు. విజయవాడ నుంచి చిలకలూరిపేట మీదుగా నాయుడుపేట సమీపంలో జిందాల్ కంపెనీకి చెత్తను తరలించే క్రమంలో వాహనాలు మధ్యలో ఆగిపోయినా, ఇంకేదైనా ఇబ్బంది తలెత్తినా విఎంసి అధికారులు పట్టించుకోవడంలేదు. రోడ్డుపైనే అక్కడికక్కడే మరమ్మతు పనులు చేసి, ఆ వాహనాన్ని కండీషన్‌లో పెట్టాలి. ఈ క్రమంలో చెత్త తరలించే క్రమంలో వాహనాల బాడీ అడుగుబాగం దెబ్బతిని వ్యర్ధాలు, మురుగునీరు కారుతున్నా అలాగే ఇంజినీరింగ్ కార్మికుడు (మెకానిక్, హెల్ఫర్) వాహనాన్ని మరమ్మత్తు చేయాలి. ఇటువంటి వాతావరణంలోనే ఇంజినీరింగ్ కార్మికులు ఇటువంటి పనులు కూడా సేఫ్టీ పరికరాలు లేకుండా చేయాల్సి రావడంతో అనారోగ్యం పాలవుతున్నారు. అంతేగాక టైరు మార్చే

నిరవధిక సమ్మెలో భాగంగా విజయవాడ ధర్నా చౌక్‌లో తమ పనిని ప్రత్యక్షంగా చేస్తూ వినూత్న నిరసన తెలుపుతున్న ఇంజినీరింగ్ కార్మికులు

సమయంలో, టైర్‌కు గాలి ఎక్కించే సమయంలో, చెత్త వాహనాల ఇంజిన్, ఇతర మిషనరీ పార్టులు బాగు చేసు క్రమంలో ఏ మాత్రం ఏమరుపాటుగా ఉన్నా అదుపు తప్పి ప్రాణాలు కోల్పోయే ప్రమాదం కూడా ఉంటుంది. మరోవైపున కార్మికుల వేతనాలు గొర్రెతోక బెత్తెడు అన్న చందంగా ఉన్నాయి. వచ్చే వేతనాలకు, ఇంటి ఖర్చులకు పొంతనే ఉండదని ఇంజినీరింగ్ కార్మికులు చెబుతున్నారు. కనీసం (మిగతా 2లో)

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్టాంపులు చోరీ

విలువ రూ.13,56,300

ప్రజాశక్తి - గన్నవరం : కృష్ణాజిల్లా గన్నవరం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో బుధవారం రాత్రి రూ.13,56,300 విలువైన స్టాంపులు చోరీకి గురయ్యాయి. గురువారం ఉదయం 10 గంటలకు కార్యాలయ అధికారి ప్రసాద్, సిబ్బంది విధులకు రాగా, ఆఫీసు తాళాలు పగలగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి పరిశీలించగా చోరీ జరిగినట్లు గుర్తించారు. అనంతరం పోలీసులకు, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ ఉన్నతాధికారులకు ప్రసాద్ సమాచారం అందించారు. సేకరించిన వివరాల ప్రకారం... సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మెయిన్ రూమ్ తాళాలను దొంగలు పగలగొట్టారు. లోపలకు వెళ్లి రికార్డు రూము గదిలోకి ప్రవేశించారు. అందులో ఉన్న బీరువాను పగలకొట్టి లోపల ఉన్న నాన్ జ్యుడీషియల్ స్టాంపులను, తోక బిళ్లలను తీసుకెళ్లారు. దొంగలు ఒక పధకం చేతులకు గౌజులు వేసుకుని తాళాలను పగలగొట్టారు. రూ.100, రూ.50 విలువైన స్టాంప్‌లను తీసుకెళ్లారు. చోరీవిషయం తెలుసుకున్న

చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డిఎస్‌పి

గన్నవరం డిఎస్‌పి పి.చలసాని శ్రీనివాస రావు రంగంలోకి దిగారు. సిసిఎస్ టీమ్‌ను రప్పించారు. సిసిఎస్ సిఐ గోవింద రాజులు ఆధ్వర్యంలో క్లూస్ టీం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వచ్చి వేలిముద్రలు సేకరించారు. బీరువా వద్ద దొంగలు వదలిన గౌజులను స్వాధీనం చేసుకున్నారు. గన్నవరం సీఐ బి.వి.శివ ప్రసాద్, క్రైమ్ సిబ్బంది కూడా వివరాలు సేకరించారు. కార్యాలయంలో (మిగతా 2లో)

వదిలివెళ్లిన గ్లౌజులు

కోర్టు వద్ద న్యాయవాదులు, అనుచరులతో మాజీ ఎమ్మెల్యే వంశీమోహన్

గన్నవరం కోర్టుకు మాజీ ఎంఎల్ఎ వంశీ

ప్రజాశక్తి - గన్నవరం : మాజీ ఎంఎల్ఎ వల్లభనేని వంశీమోహన్ గురువారం గన్నవరం కోర్టు, పోలీస్ స్టేషన్‌కు వచ్చారు. బెయిల్‌పై విజయవాడ జైలు నుంచి విడుదలైన ఆయన పలు కేసుల్లో ష్యూరిటీలు సమర్పించేందుకు స్థానిక కోర్టు, స్టేషన్‌కు న్యాయవాదులతో కలిసివచ్చారు. వంశీ వెంట ఆయన సతీమణి పంకజశ్రీ, పలువురు వంశీ అనుచరులు ఉన్నారు. అంతకుముందు వంశీ దంపతులు మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన గహంలో కలిశారు.

కృష్ణా నదిలో పెరిగిన జలరవాణా

- తెలంగాణాకు కూడా పడవలు, బల్లకట్లు

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల నుంచి తెలంగాణకు జలరవాణా సౌలభ్యం పెరిగింది. గుంటూరు, పల్నాడు జిల్లాల మీదుగా ఎన్‌టిఆర్ జిల్లా నుంచి తెలంగాణ ప్రాంతానికి కృష్ణానదిలో పడవులు, బలకట్ల ద్వారా రవాణాను ఆయా ప్రాంతాల వాసులు వినియోగించుకుంటున్నారు. కేవలం 9 నెలల కాలపరిమితికి టెండర్లు ఖరారు చేశారు. ఇందుకు సంబంధించి ఉమ్మడి గుంటూరు జిల్లా

పరిషత్‌తో గురువారం నిర్వహించిన పడవలు, బలకట్ల వేలంలో టెండర్లను ఖరారు చేశారు. పల్నాడు జిల్లా అచ్చంపేట మండలం చింతపల్లి నుంచి పడవ ద్వారా ఎన్‌టిఆర్ జిల్లా ఇస్తేపల్లికి రవాణను కొనసాగించేందుకు ఎం.జనార్ధన రావు రూ.2.20 లక్షల (మిగతా 2లో)

వార్త మెయిన్‌లో



కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయిని స్వాధీనం చేసుకున్న ఐజిపి ఆకే రవికష్ణ, డిసిపి కె.జి.వి.సరిత, రైల్వే ఎస్‌పి కె.నగేష్ బాబు

కోరమండల్ ఎక్స్‌ప్రెస్‌లో గంజాయి స్వాధీనం

పలు రైళ్లలో తనిఖీలు

తైక్వాండో పోటీల్లో అమలి విద్యార్థులకు పతకాలు

విజయవాడ : ఉత్తరాఖండ్ హరిద్వార్‌లో జూన్ 23 నుండి 25వ తేదీ వరకు జరిగిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ తైక్వాండో పోటీల్లో విజయవాడ సత్యనారాయణపురం అమలీ ఇంగ్లీషు మీడియం హైస్కూల్ విద్యార్థులు గోల్డ్ మెడల్ సాధించారు. జి.యోగ్యశ్రీ మహాలక్ష్మి గ్రూప్ పుంసే విభాగంలో గోల్డ్‌మెడల్, పేర్‌పుంసే విభాగంలో బ్రౌంజ్ మెడల్ సాధించింది. అలాగే జి.లియో సోనాల్ గ్రూప్ పుంసే విభాగంలో గోల్డ్‌మెడల్, క్యోరూగి 47 కిలోల పైవిభాగంలో బ్రౌంజ్ మెడల్, జి.మౌనిష్ షేర్ పుంసే విభాగంలో బ్రౌంజ్ మెడల్ సాధించారు. జాతీయ స్థాయిలో మెడల్స్ సాధించి రాష్ట్రానినీ, అమలి పాఠశాలకూ మంచి పేరు తీసుకువచ్చిన విద్యార్థులను, కోచ్ ఎం.అంకమ్మరావును పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సిస్టర్ మేరీ శారద, పిఇటి అర్జా వెంకటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు.

ఘనంగా టూ వీలర్స్ డే వేడుకలు

●మెకానిక్‌లకు ఉచిత వైద్య శిబిరం ●పలువురికి సన్మానం

విజయవాడ : ది విజయవాడ టూ వీలర్స్ మెకానిక్ అండ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యాన గురువారం అంతర్జాతీయ మెకానిక్ డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా గవర్నరుపేట రాఘవయ్యపార్క్ సమీపంలోని కేక్ కట్ చేశారు. అనంతరం టూ వీలర్ మెకానిక్‌లకు హెల్ప్ ఆస్పత్రి, సేఫ్ విజన్ ఐ ఆధ్వర్యాన ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు చేస్తామని వైద్య సిబ్బంది తెలిపారు. అలానే మెకానిక్‌లు పనిచేస్తూ పిల్లలను డాక్టర్లుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులను సన్మానించారు. అలాగే సీనియర్ మెకానిక్‌లను సన్మానించారు. అలానే లియన్‌నెట్ స్కిల్స్ అండ్ కాస్ట్రోల్ వారు సంయుక్తంగా బిఎస్ 6 ట్రైనింగ్ ప్రోగ్రాం నిర్వహించి సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈకార్యక్రమంలో ముఖ్య అతిథులుగా హెల్ప్ హాస్పిటల్ చైర్మన్ డాక్టర్ పువ్వాడ రవితేజ, న్యూరాలజిస్ట్, సీఈవో జయంత్ బాబుతోపాటు వీకే పెట్రోలియమ్స్ ప్రసాద్, కాస్ట్రోల్ దుర్గారావు, అసోసియేషన్ నగర అధ్యక్షులు ఆంజనేయ దాసు, గౌరవాధ్యక్షులు ఎమ్‌డి ఫిరోజ్, ఉపాధ్యక్షులు వెంకటరమణ, పి.వి.కృష్ణ, కార్యదర్శి జానీ, కోశాధికారి ఇ.వెంకట నరేష్ తదితరులు పాల్గొన్నారు.

IN THE HONOURABLE COURT OF THE XIII ADDL. DISTRICT JUDGE-CUM-CHAIRMAN, MACT, AT GAJUWAKA
M.O.P.No.469/2024

Between:
Talasila Anil Kumar & others ... Petitioners
And:
M.Jaya Raju & another ... Respondents

NOTICE

To:
R-1: Mundru Jaya Raju
S/o Ramaswamy,
Hindu, Aged 54 years,
D.No.33/3, Rivas Kalava,
Purushotham Nagar,
Prasadampadu, Vijayawada,
Krishna District-08.
Owner-Cum-Driver of the Lorry bearing No. AP 16 TX 7199.

Please take notice that the above named petitioner filed the above M.O.P. against you for claiming compensation and the matter was coming for your appearance and stands posted to **20.07.2025** on that day your personally or through Advocate attend before the Hon'ble Court at **10.30 A.M** falling which, the Honourable Court is decided under the Court of Law.)

K.V.BRAHMAM,
PRAMUKH,
Advocates Gajuwaka.
Cell. 9290457610

25 మంది వాహనదారులకు రూ.2.75 లక్షల జరిమానా

ప్రజాశక్తి - విజయవాడ : 2వ, 4వ ట్రాఫిక్ పోలీసులు మొత్తం 25 కేసుల్లో మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిని గురువారం విజయవాడ ఆరో అడిషనల్ జ్యూడిషల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్ట్‌లో ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి లెనిన్ బాబు మొత్తం 25 మందిలో ఐదుగురికి ఒక్కొక్కరికి రూ.15 వేల చొప్పున రూ.75 వేలు, మిగిలిన 20 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున రూ.2 లక్షలు, మొత్తం 25 మందికి రూ.2.75 లక్షల మేర జరిమానా విధించారు.

మొదటిపేజీ తరువాయి

వర్సిటీ వద్ద ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నేతలు

ఎఆర్ గ్రౌండ్స్ వద్ద విద్యార్థులకు మద్దతుగా నిరసన తెలుపుతున్న సిపిఎం నేతలు సిహెచ్.బాబూరావు, డి.వి.కృష్ణ, డి.కాశీనాథ్, ఎన్.సిహెచ్.శ్రీనివాస్ తదితరులు

హెల్త్ వర్సిటీ వద్ద ఉద్రిక్తత

సాయంత్రం 4 గంటల సమయంలో పోలీసులు విరుచుకుపడ్డారు. వైద్య విద్యార్థుల ఆందోళనకు సంఘీభావం ప్రకటించడానికి వచ్చిన ఎస్ఎఫ్ఐ, ఎఐఎస్ఎఫ్, వైఎస్ఆర్‌సిపి విద్యార్థి సంఘం, ఎబివిపి తదితర విద్యార్థి సంఘాల నేతలను అరెస్టు చేశారు. నిరసన తెలుపుతున్న విద్యార్థులపైనా పోలీసులు తమ ప్రతాపం చూపారు. మహిళా విద్యార్థులను జుట్టు పట్టుకుని ఈడ్చుకెళ్లారు. దీంతో వైద్య విద్యార్థినులు కన్నీటి పర్యంతమయ్యారు. ఆందోళన చేస్తున్న విద్యార్థులను, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ప్రసన్న కుమార్, ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, నగర కార్యదర్శి గోపి, పిడిఎస్‌యు రాష్ట్ర కార్యదర్శి వినోద్, రాష్ట్ర నాయకులు రాకేష్, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సాయి, వైఎస్ఆర్ సిపి విద్యార్థి సంఘం నాయకులు డి.రవిచంద్ర తదితరులను పోలీసులు అదుపులోకి తీసుకుని నగరంలోని ఎఆర్ గ్రౌండ్స్‌కు తరలించారు. ఎఆర్ గ్రౌండ్స్ వద్ద బయట ఉన్న వైద్య విద్యార్థులకు, కనీసం గాయాలైన వైద్య విద్యార్థులకు వైద్య సదుపాయాలు కూడా కల్పించలేదు.

సిపిఎం నేతలను అడ్డుకున్న పోలీసులు

ఎఆర్ గ్రౌండ్స్‌లో ఉన్న వైద్య విద్యార్థులను, విద్యార్థి సంఘాల నేతలను పరామర్శించేందుకు వచ్చిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు, ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డి.వి.కృష్ణ, రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.సిహెచ్.శ్రీనివాస్‌లను పోలీసులు అడ్డుకున్నారు. దీంతో పోలీసులతో నేతలు వాగ్వాదానికి దిగారు. కొద్దిసేపు అనంతరం సిపిఎం నేతలు ఎఆర్ గ్రౌండ్స్‌లోకి వెళ్లి వైద్య విద్యార్థులను పరామర్శించారు. వారి నిరసనకు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల విదేశీ వైద్య విద్యార్థులు వైద్య సేవలు అందించేందుకు పర్మినెంట్ రిజిస్ట్రేషన్ ఇవ్వాలని కోరారు. వైద్య విద్యార్థుల సమస్యను ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. అలాగే వైసిపి విజయవాడ తూర్పు నియోజకవర్గ ఇన్చార్జి దేవినేని అవినాష్ కూడా వైద్య విద్యార్థులను పరామర్శించారు.

ప్రమాదాల నడుమ ఇంజినీరింగ్ కార్మికుల బతుకులు

పారిశుధ్య కార్మికులకు ఇస్తున్న హెల్త్ అలవెన్స్ రూ.6 వేలను కూడా ఇంజినీరింగ్ కార్మికులకు ప్రభుత్వం ఇవ్వడం లేదు. దీంతో మెకానిక్‌కు నెలకు రూ.18,500లు, హెల్పర్‌కు రూ.15 వేల వేతనంలో పిఎఫ్, ఇఎస్ఐ పోను రూ.16,400 మెకాని క్‌కు, రూ.13,500 హెల్పర్‌కు చేతికి అందుతున్నాయని విఎంసి వెహికల్ డిపోలో 27 సంవత్సరాల నుంచి మెకానిక్‌గా పనిచేస్తున్న యర్రంశెట్టి దుర్గా ప్రసాద్ తెలిపారు. ఈ వచ్చే వేతనంలోనే ఇంటి అద్దె కింద రూ.7 వేలు, కరెంట్ బిల్లు రూ.ఆరేడు వందలు, సరుకులు మరో రెండు వేలు, పాలు, గ్యాస్, పిల్లల చదువులు, వైద్యం ఇవన్నీ కలుపుకుంటే కనీసంగా రూ.20 వేల నుంచి 25 వేల వరకు ఖర్చు ఉంటుందని ఆ కార్మికుడు తన అనుభవాన్ని ప్రజాశక్తికి వివరించాడు. తాను వెహికల్‌డిపోలో కార్మికుడిగా చేరిన తొలి రోజుల్లో రోజుకు రూ.40 చొప్పున నెలకు రూ.1200 ఇచ్చేవారని, అన్నీ కటింగులు పోను చేతికి వెయ్యి మాత్రమే వచ్చేదని చెప్పారు. ఇన్ని సంవత్సరాలు పనిచేసిన తర్వాత కూడా కేవలం రూ.18,500 మాత్రమే ఇస్తున్నారని, ప్రస్తుతం పెరిగిన ధరలతో కుటుంబాలు గడవటమే కష్టంగా ఉందని దుర్గాప్రసాద్ అనే కార్మికుడు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. పని మాత్రం చాలా కష్టంగా, దుర్భరంగా ఉంటుందని ఆ కార్మికుడు తెలుపుతున్నాడు. 18 నుంచి 30 టన్నుల బరువు ఉండే చెత్త తరలింపు వాహనం బాడీ దెబ్బతిని, రోడ్డుమార్గంలో ఆగిపోతే చెత్త, ఇతర వ్యర్థాల నుంచి నీరు కారుతూ దుర్వాసన మధ్యలోనే వాహనాన్ని మరమ్మతు పనులు చేయాల్సి ఉంటుందన్నాడు. ఆ మురుగునీరు తమపైన పడటం వలన చర్మవ్యాధులు, ఇతర అనారోగ్య సమస్యలు వస్తుంటాయని దుర్గాప్రసాద్ తెలిపారు. కొన్ని సందర్భాల్లో మెకానిక్ పని సమయంలో ఏమాత్రం ఏమరు పాటుగా ఉన్నా అదుపు తప్పి ప్రాణాలకే ముప్పు వచ్చే ప్రమాదం లేకపోలేదని వివరించారు. బాడీ లోపల బాగంలో వెల్డింగ్ చేస్తున్న సమయంలో ప్రమాద వశాత్తు అగస్టీన్ అనే కార్మికుడు తీవ్రంగా దెబ్బతిని, ప్రాణాపాయ స్థితిలోకి వెళ్లాల్సి వచ్చిందని గుర్తు చేస్తున్నాడు. అలాగే హరి అనే కార్మికుడికి ట్యూబ్‌కు గాలి ఎక్కించే క్రమంలో దాని రింగ్ సరిగా లేక ఒక్క దెబ్బకు కార్మికుడి దవడ భాగం, పళ్లు పూర్తిగా దెబ్బతిన్నాయని దుర్గాప్రసాద్ తన అనుభవాన్ని తెలిపాడు. పనిచేసే క్రమంలో ఇతర అవయవాలు కూడా దెబ్బతింటాయని కార్మికులు తెలుపుతున్నారు. చెత్త తరలింపు వాహనం టైర్‌కుగాలి ఎక్కువ పెట్టినా , కొన్ని సందర్భాల్లో టైర్ పేలిన సందర్భాల్లో అందుబాటులో ఉన్న మెకానిక్‌కు తీవ్రమైన గాయాలయిన పరిస్థితి ఉందని మెకానిక్ గద్దె బాబూరావు తెలిపారు. ఆ టైర్లు ఎక్కించే సమయంలో, పంక్చర్ వేసే సమయంలో ఎంత కడిగినా ఆ టైర్ వాసన పోదని, అటువంటి పరిస్థితిలోనే భోజనం చేయాల్సి వస్తోందని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాల నడుమ పనులు చేస్తూ చాలీచాలనీ వేతనాలతో కుటుంబాలు గడవక దుర్భరమైన స్థితిలో ఉన్న తమను ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని ఇంజినీరింగ్ కార్మికులు కోరుతున్నారు.

గద్దె బాబురావు, వై.దుర్గాప్రసాద్

సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో స్టాంపులు చోరీ

ఉన్న సిసి కెమెరాలను పరిశీలించగా, అవి పని చేయడం లేదని సిబ్బంది చెప్పారు. బయట షాపులో ఉన్న సిసి కెమెరాల పుటేజీని సేకరించారు.

రూ.13,56,300 విలువైన స్టాంపులు పోయినట్లు గుర్తింపు

చోరీకి గురైన స్టాంప్‌లకు సంబంధించిన వివరాలను స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ డిఐ జి.రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ మూర్తి సమక్షంలో సేకరించారు. నాన్ జ్యూడిషియల్ రూ.100, రూ.900, రూ.50 విలువైన 3600 స్టాంప్‌లు, రూ.50 విలువైన 12,500 తోక బిళ్లలు, రూ.100 విలువైన 4,609 తోక బిళ్లలు చోరీకి గురైనట్లు గుర్తించారు. వీటి విలువ మొత్తం రూ.13,56,300 ఉంటుందని తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్ ఫిర్యాదు మేరకు గన్నవరం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్యాలయ అటెండర్ కాజాను అదుపులోకి తీసుకుని ప్రశ్నిస్తున్నారు. చోరీకి గురైన స్టాంపులను నెంబర్ల ప్రకారం బ్లాక్ లిస్టులో పెడతామని అధికారులు తెలిపారు. సబ్ రిజిస్ట్రార్ల సంఘం రాష్ట్ర నాయకులు కృష్ణ మోహన్, వెంకటేశ్వరావు, దగాని శ్రీను తదితరులు వచ్చి స్థానిక సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్‌కు అండగా నిలిచారు. చోరీ జరగడానికి గల కారణాలను లోతుగా పరిశీలించి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను కోరారు.

కృష్ణానదిలో పెరిగిన జల రవాణా

రుసుముతో టెండరు దక్కించుకున్నారు. అచ్చంపేట మండలం గింజుపల్లి నుంచి వేదాద్రికి పడవ ప్రయాణం కోసం రూ.3.50 లక్షల రుసుముతో కె.శ్రీనివాసరావు కాంట్రాక్టు దక్కించుకున్నారు. అచ్చంపేట మండలం మాదిపాడు నుంచి తెలంగాణలోని సూర్యాపేట .జిల్లా బుగ్గమదారం రేవు వరకు బలకట్టు నిర్వహణకు కె.సతీష్ అనే కాంట్రాక్టరు రూ.4.50 లక్షలతో కాంట్రాక్టు పొందారు. అయితే అప్‌సెట్ ప్రైస్ రూ.7.75 లక్షలుగా నిర్ణారించగా తక్కువ రేటుకు కాంట్రాక్టు పొందారు. మాచవరం మండలం గోవిందాపురం నుంచి సూర్యపేట జిల్లా చింతిర్యాల రేవుకు బల్లకట్టు నిర్వహణకు కాంట్రాక్టర్లు ఎవ్వరూ ముందుకు రాలేదు. అమరావతి మండలం దిడుగు నుంచి కృష్ణా జిల్లా ఏటూరు వరకు పడవ నడుపుకునేందుకు బి.రఘురామయ్య 9నెలల కాలపరిమితికి రూ.6 లక్షల రుసుముతో కాంట్రాక్టు దక్కించుకోగా కొల్లిపర మండలం వల్లభాపురం నుంచి కృష్ణాజిల్లా వల్లూరుపాలెంకు పడవ నడుపుకునేందుకు పాటదారులు ఎవ్వరూ రాలేదని అధికార వర్గాలు తెలిపాయి.

CHANGE OF NAME

I, **Simhadri Venkateswara Rao, S/o. Late Veeraswamy,** Do.No.66-3-27, Tagore Type Institute Road, Patamata, Vijayawada-10, do hereby solemnly and state on oath as follow. That I was born and brought up in the same door number. Our fore fathers for unknown time resided in the said door number in the same address. I studied upto intermediate and did small business earlier. In school certificates i.e. Tenth class and intermediate my orginal name is **Simhadri Venkateswara Rao, S/o. Veeraswamy.** That I have been called with my nick name **Kondala Rao** in the vicinity and by known persons from my childhood. My name was recored as **Simhadri Kondala Rao** instead of my original name as **Simihadri Venkateswarao.**

ప్రకటన

ఇందుమూలముగా నా క్లయింట్ అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, కల్లూరు బ్రాంచి వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని పగడాల పూర్ణచంద్రరావు తండ్రి: (లేటు) రామారావు, వయస్సు:27 సం॥, నివాసం: మెయిన్‌రోడ్, వినగడప గ్రామం, గంపలగూడెం మండలం, యన్.టి.ఆర్. జిల్లా వారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్థిపై ఎవరి కైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లయిములు, తనఖాలు, అగ్రిమెంట్‌లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్న యెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాత పూర్వకముగా తెలియజేయగలరు.తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింట్ బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్థి: యన్.టి.ఆర్ జిల్లా, తిరువూరు సబ్ రి జిస్ట్రార్ వారి యిలాకా గంపలగూడెం మండలం, వినగడప గ్రామపంచాయితీ ఏరియాలోని వినగడప గ్రామ తాలూకు ఆర్.యస్.నెం. 132/2, దాఖలు మాకు హక్కు గల య.0. 05శెంట్లు, అర్‌ఎస్ నెం. 132/3, **డాక్యుమెంట్ నెం. 1846/2023** దాఖలా య.0.05 సెంట్లలో య.0.00 1/2, వెరశి 0.05 1/2, సెంట్లకు అయిన 266.2 చ॥గ॥ లకు సరి యైన 222.543 చ॥మీ॥ ల స్థిరాస్తినకు హద్దులు : **తూర్పు:** పగడాల విజయలక్ష్మి గారి భూమి, **దక్షిణము:** పగడాల సత్యనారాయణ గారి భూమి, **పడమర :** సిసి రోడ్డు, **ఉత్తరం** : నా తాలుకూ స్థలం.

పలివెల గణేష్ బాబు
అడ్వకేట్, కొత్తగూడెం సెల్ : 9849246278

ప్రకటన

యావన్మందికి తెలియజేయటమైనది ఏమనగా, మా క్లయింటు, కృష్ణాజిల్లా గుడివాడ మండలం మందపాడు గ్రామ కాపురస్తులు గంట వెంకటరత్నం గారి కుమారుడు శోభన్ బాబు ది.7.3.2001న, గుడివాడ పట్టణంలోని 17వ వార్డులో చేరిన మందపాడు గ్రామం లోని R.S.No.20/2 లో గల 132 చదరపు గజముల నివేశన స్థలాన్ని, కృష్ణాజిల్లా పాములపాడు గ్రామ శివారు దూళ్ళవానిగూడెం గ్రామ కాపురస్తురాలు దోనే షద్రుక్కు గారి భార్య నాగమణి వారి నుండి దఖలు పొంది ఉన్నారు. సదరు దస్తావేజు గుడివాడ సబ్ రిజిస్టార్ గారి ఆఫీస్ నందు దస్తావేజు నంబరు. 595/2001 గా రిజిస్టర్ కాబడి ఉన్నది. మా క్లయింటు ది.3.5.2025 న సదరు దస్తావేజును ఫోటోస్టాట్ తీయించుటకు ఫోటోస్టాట్ షాపునకు తీసుకువెళ్లి ఫోటోస్టాట్ తీయించిన దరిమిలా సదరు దస్తావేజులోని మొదటి పేజీ అనగా రూ.500 స్టాంప్ గల 34094 నంబరు గల పేజీ కనిపించకుండా పోయినది. కావున సదరు దస్తావేజు మొదటి పేజీని ఉపయోగించుకొని ఎవరు కూడా ఏ విధమైన లావాదేవీలు జరిపిన మా క్లయింటు వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొన బడును.

ఇట్లు,
సుంకర రాజేంద్ర ప్రసాద్
కలతోటి క్రాంతికుమార్
న్యాయవాదులు
విజయవాడ.

విజయవాడ
03.07.2025

9న సమ్మెను జయప్రదం చేయండి

చల్లపల్లి మండలంలో

ప్రజాశక్తి-చల్లపల్లి : కార్మికుల సమస్యల పరిష్కారం కోరుతూ ఈ నెల 9వ తేదీన చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని వామపక్ష నేతలు, కార్మికులకు పిలుపునిచ్చారు. స్థానిక గుంటూరు బాపనయ్య శ్రామిక భవనం సిపిఎం మండల కార్యదర్శి యద్దనపూడి మధు అధ్యక్షతన వామపక్ష నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశము నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళా కార్మికులకు పరిశ్రమంలో రాత్రి వేళల్లో షిఫ్టులు వేయాలని తీర్మానించటం అన్యాయమని అన్నారు. కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను అడ్డుకోవటానికి కేంద్ర కార్మిక సంఘాల సంయుక్త పిలుపుమేరకు ఈ నెల 9వ తేదీన చేపట్టిన దేశ వ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కార్యదర్శి మహమ్మద్ కరీముల్లా,, మండల వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు మేడిపల్లి వెంకటేశ్వరరావు, మండల రైతు సంఘం అధ్యక్షులు బండారు కోటేశ్వర రావు, చేనేత కార్మిక నాయకులు బళ్లా వెంకటేశ్వరరావు, సిపిఐ దివి డివిజన్ కార్యదర్శి గుత్తికొండ రామారావు, ఏపీ రైతు సంఘం నాయకులు సురేంద్రనాథ్ బెనర్జీ, సిపిఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ నాయకులు పరుచూరి జనార్ధన్, కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి జగ్గారపు బాబురావు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉయ్యూరు** : జులై 9 సమ్మె జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బి రాజేష్ అన్నారు. గురువారం ఉయ్యూరు మండలం గండిగుంట పంచాయతీ కార్మికులతో జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ ప్రజల్ని గ్రామాల్ని పరిశుభ్రం చేయడంలో గ్రామపంచాయతీ కార్మికులు కీలక పాత్ర వహిస్తున్నారని అన్నారు. ప్రభుత్వాలు గ్రామపంచాయతీ కార్మికులను శ్రమకు గుర్తించి వారికి తగిన ఫలాలు వేతనాలు ద్వారా చెల్లించాలని కోరారు. పారిశుద్ధ్య కార్మికులు అరకొర వేతనాలతో గ్రామపంచాయతీలో తమ నమ్ముకున్న పనికి న్యాయం చేస్తూ గ్రామాల రోడ్లన్నీ పరిశుభ్రం చేస్తున్నారని చెప్పారు.సమ్మె రోజు జరిగే ర్యాలీ ప్రదర్శనలో కార్మికులు పాల్గొని సమ్మెను జయప్రదం చేయాలని కార్మికుల్ని కోరారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకులు లక్ష్మీ రంగమ్మ శీను వెంకటేశ్వ రావు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-మొవ్వ** : మొవ్వ మండలంలోని మొవ్వ మధ్యాహ్నం భోజనం పథకం కార్మికులు డిమాండ్ నోటీసును ఎంఈఓ కార్యాలయంలో గురువారం అందించారు. మధ్యాహ్న భోజన కార్మికులకు కనీసవేతనం 26000 ఇవ్వాలని, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మెనూ చార్జీలు ఒక్కొక్క విద్యార్థికి కనీసం రూ.20 ఇవ్వాలని, జాతీయ విద్యా విధానం 2020ని రద్దు చేయాలని, తొలగించిన కార్మికులను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మధ్యాహ్న భోజనం కార్యదర్శి కె ఎస్తేరురాణి, కార్మికులు చిన్ని, విజయ, సౌజన్య, నాగలక్ష్మి, రాధా, భూలక్ష్మి, కనికరం, జిల్లా నాయకులు శీలం నారాయణరావు, సిఐటియు మండల సభ్యులు చిగురుపల్లి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి** : స్థానిక సిఐటియు కార్యాలయంలో మండల సిఐటియు నాలుగో మహాసభ ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షులు సిహెచ్ గంగాభవాని అధ్యక్షతన జరిగిన మహాసభలో ముఖ్య అతిథిగా పాల్గొన్న సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులుమర్రాపు పోలి నాయుడు మాట్లాడుతూ అనేక పోరాటాలు చేసి ప్రాణాలర్పించి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం కాలరాస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులుకు అను కూలంగా చట్టాలు చేసి కార్మికులను అడగదొక్కేందుకు కేంద్ర ప్రభుత్వం చట్టాలను తీసుకొచ్చిందన్నారు. ప్రభుత్వాలకు తీసుకొచ్చిన కొత్త చట్టాలకు వ్యతిరేకంగా ఈనెల 9వ తేదీన చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహమ్మద్ కరీముల్లా కన్వీనర్, సిహెచ్ గంగాభవాని కోకన్వీనర్లుగా 20 మంది కమిటీ సభ్యులతో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ మహాసభలో అంగన్వాడి,ఆశ కార్య కర్తలు పంచాయతీ, ఆటో కార్మికులు పాల్గొన్నారు

ఉయ్యూరు మండలంలో మాట్లాడుతున్న రాజేష్

కనపర్తికి పరువు నష్టం నోటీసు

న్యాయవాది శేషగిరిరావు

ప్రజాశక్తి-అవనిగడ్డ : టిడిపి నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావుపై అవనిగడ్డ ప్రముఖ న్యాయవాది బడే శేషగిరి కోటి రూపాయల పరువు నష్టం వేశారు. ఈ మేరకు గురువారం శేషగిరి అవనిగడ్డలో విలేకరులతో మాట్లాడుతూ శ్రీనివాసరావు తన కుటుంబం మీద, తన కుమారుడు బడే గౌతమ్ మీద పోలీసు అధికారుల సమక్షంలో వాడిన అశ్లీల అసభ్యకరమైన భాషపై న్యాయపరంగా ఖండించాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. సెప్టెంబర్ నెల 2024లో అవనిగడ్డ పోలీస్ స్టేషన్లో జరిగిన సంఘటన అనంతరం ఆయన మాటలు సోషల్ మీడియా ద్వారా విస్తతంగా వ్యాప్తి చెందాయన్నారు. ఒక సీనియర్ న్యాయవాది అయిన తనను, తన కుటుంబంపై చేసిన వ్యాఖ్యలపై తాను గతంలో క్షమాపణ కోరానని, కనీస చింతన లేకుండా క్షమాపణ కూడా చెప్పలేదని, దీంతో కోటి రూపాయల పరువు నష్టం దావాను వేయడానికి తుది నోటీసు జారీ చేశానన్నారు. మరల చివరి అవకాశంగా ఈ నోటీస్ అందిన తర్వాత నుండి 30 రోజుల వ్యవధిలో అయిన పబ్లిక్ మీడియా ముందు క్షమాపణ చెప్పకపోతే న్యాయస్థానంలో పరువు నష్టం దావా వేయడం తప్పదని శేషగిరిరావు తెలిపారు.

ఎస్ఎఫ్ఐ నాయకుల అక్రమ అరెస్టు తగదు

ప్రజాశక్తి మచిలీపట్నం అర్బన్ : విదేశాల్లో వైద్య విద్య పూర్తి చేసుకున్న డాక్టర్లుకు శాశ్వత రిజిస్ట్రేషన్ చేయాలని డిమాండ్ చేస్తూ ఎన్టిఆర్ వైద్య విశ్వవిద్యాలయం వద్ద శాంతియుతంగా ఆందోళన చేస్తున్న విద్యార్థులు, విద్యార్థి సంఘాల నాయకులను గురువారం అరెస్టు చేసి స్టేషన్ కి తరలించడం సిగ్గు చేటని ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు సమరం ఆందోళన వ్యక్తం చేశారు. శాశ్వత రిజిస్ట్రేషన్ కొరకు వేచి ఉన్న వారికి మద్దతుగా నిలిచిన ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి కే.ప్రసన్నకుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు సిహెచ్. వెంకటేశ్వరరావు, ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షులు గోపి నాయక్ ఇతర నాయకులను వెంటనే విడుదల చేయాలని, లేని పక్షంలో ఆందోళన కార్యక్రమం ఉదతం చేస్తామని అన్నారు.

గొర్రెలు, మేకలకు నట్టల మందు పంపిణీ

ప్రజాశక్తి-హనుమాన్ జంక్షన్ (గన్నవరం) : గొర్రెలు, మేకల నట్టల నివారణ కార్యక్రమం గురువారం మల్లవల్లి గ్రామంలో జరిగింది. గొర్రెలు, మేకల పెంపకదారుల సంఘం, అధ్యక్షులు కట్టుబోయిన జమలయ్య, కార్యదర్శి సాకిరీ వెంకటేశ్వరావు, గొర్రెలు, మేకలకు నట్టల మందులు తాగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఏరియా వెటర్నరీ హాస్పిటల్, బాపులపాడు, పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు డాక్టర్ ఎం ప్రమీలారాణి జీవాల పెంపకం దారులకు అవగాహనా సదస్సు - టీకాల పట్ల అవగాహన వర్షాకాలంలో ఎక్కువగా వచ్చే ఫుట్ రాట్ వంటి వ్యాధుల నిర్మూలనకు తీసుకోవాల్సిన సలహాలు సూచనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మల్లవల్లి పశుగణ సహాయకులు కె.రామకృష్ణ , జీవాల పెంపకం దారులు తదితరులు పాల్గొన్నారు.

చదువు, ఆరోగ్యం పట్ల శ్రద్ధ అవసరం

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : బాల బాలికలు విద్యార్థి దశలోనే ఆరోగ్యం పట్ల అవగాహనా కలిగి ఉండాలని మచిలీపట్నం మహిళా పోలీస్ స్టేషన్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వీ శ్రీనివాసరావు అన్నారు. గురువారం స్థానిక లేడీ యాంప్తిల్ ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో వైద్య శాఖ ఆధ్వర్యంలో దివ్య డయాగ్నస్టిక్ సెంటర్, ఎన్ ఎస్ ఎస్ యూనిట్, రెడ్ రిబ్బన్ క్లబ్ ఆధ్వర్యంలో 700 మంది విద్యార్థులకు బ్లడ్ గ్రూపింగ్, హెచ్.బి పర్సంట్ పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎస్ఐ మాట్లాడుతూ చదువుతో పాటు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలన్నారు. ఎవ్వరికైనా రక్తం అవసరమైతే రక్తదానం చేసేందుకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఇంటర్మీడియట్ విద్యా శాఖ ఆదేశాల మేరకు కళాశాల ప్రిన్సిపాల్ పి లక్ష్మి అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో దాదాపు 30 మంది ఏఎన్ఎంలు, దివ్యా డయాగ్నస్టిక్స్ సిబ్బంది, ఎన్ ఎస్ ఎస్ యూనిట్ అధికారి లంకిశెట్టి హరిబాబు, అధ్యాపకులు విజయశ్రీ, హిరణ్మయి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నిబంధనలపై బిఎల్వోలకు అవగాహన

ప్రజాశక్తి-పామర్రు : బిఎల్ఓలు ఎన్నికల నియమ నిబంధనలపై పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలని పామర్రు నియోజకవర్గ ఎన్నికల ఎలక్ట్రోల్ అధికారి, జి రమేష్ అన్నారు. గురువారం జిల్లా పరిషత్తు హైస్కూల్లో ఎన్నిల విధి విధానాల పై నియోజకవర్గ స్థాయి మాస్టర్స్ ట్రైనర్స్లతో పాటు బిఎల్ఓలకు ఒక రోజు ఏర్పాటు చేసిన శిక్షణ తరగతుల్లో ఏఆర్ఓ.రవికాంత్ తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జి.రమేష్ మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్ జాబితా తయారీలో బిఎల్ఓల పాత్ర కీలకమైందనన్నారు. నియోజక వర్గంలో ఉన్న 238 మంది బిఎల్ఓ లకు ఈ నెల 9 నుండి ఓటర్ జాబితా తయారి, మార్పులు, చేర్పులు అలాగే మరణించిన వారు, వలస వెళ్లిన వారి ఓట్లను పరిశీలించి తుది సమాచారం అందించుటలో కీలక పాత్ర పోషించే విధంగా శిక్షణా తరగతులు చేపట్టాలని సూచించారు. నియోజకవర్గంలో ఎన్నికల సందర్భంగా చేపట్టే కార్యక్రమాల్లో వివిధ పార్టీల ప్రతినిధులకు సమాచారం అందించాలని సూచించారు. 80 సంవత్సరాలు దాటిన ఓటర్ వివరాలను తప్పక సేకరించాలని ఆదేశించారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనింగ్ యార్లగడ్డ మదుల, ఎన్నికల అసెస్టెంట్ బట్టు రజినీకాంత్, తదితరులు పాల్గొన్నారు.

జనవాణిలో వినతుల స్వీకరణ

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మంగళగిరిలోని జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వరుసగా రెండో రోజు మచిలీ పట్నం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్, ఉమ్మడి కృష్ణాజిల్లా డిసిఎం ఎస్ చైర్మన్ బండి రామకష్ణ పాల్గొని ప్రజల నుంచి సమస్యలు స్వీకరిం చారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గడ్డంరాజు, గళ్ళా తిమోతి, బొమ్మ సాని నరేశ్, చిల్లంకుర్తి పిచ్చేశ్వరరావు, కోటి వివిధ హెూదాలో ఉన్న జనసేన పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

లారీలతో రోడ్డు గుంతలమయం

ప్రజాశక్తి- నందివాడ : మండలంలోని ఇలపర్రు శివారు కుదరవల్లి చెట్ల సమీపంలో ఓ ఆక్వా చెరువు రైతు చెరువు పట్టుబడి చేస్తున్నారు. ఈ క్రమంలో పట్టుబడికి వచ్చిన ఐసు లారీలను రోడ్డుకు అడ్డుగా ఉంచడంతో వచ్చే పోయే వాహనాలకు అంతరాయం కలుగుతోంది. గురు వారం గుడివాడ నుండి లక్ష్మీనరసిం హాపురం వెళ్లే ఆర్టీసీ బస్సు వెళ్లే మార్గం లేక దాదాపు గంటసేపు నిలిచిపోయింది. దీంతో స్కూల్ కి వెళ్లే విద్యార్థులు ప్రయాణికులు నానాఅవస్థలు ఎదుర్కొ న్నారు. ఉన్న చిన్నరోడ్డుపై గుంతలు పడి అధ్వా నంగా తయారైందని, దానిని చేపల చెరువులకు వచ్చే ఐస్ లారీలు ఇంకా నాశనం చేస్తున్నాయంటూ గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టి రోడ్లను పాడు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని వాహనదారులు, గ్రామస్తులు కోరుతున్నారు.

పట్టాభిరామ్‌కి ఘన నివాళి

ప్రజాశక్తి-మచిలీపట్నంఅర్బన్ : తన ఇంద్రజాల ప్రదర్శనతో అశేష అభిమానులను సంపాదించుకున్న బీవీ పట్టాభిరామ్ ఆకస్మిక మరణం సమాజానికి తీరని లోటుగా పలువురు వక్తలు పేర్కొన్నారు. గురువారం మచిలీపట్నం స్థానిక ఇంగ్లీష్ పాలెం మైండ్ కేర్ కౌన్సిలిం, ట్రైనింగ్ సెంటర్లో కౌన్సిలింగ్ సైకాలజిస్ట్ విడియాల చక్రవర్తి, సుధామయి ల నేతృత్వంలో నిర్వహించిన కార్యక్రమంలో బి వి పట్టాభిరామ్ కు ఘన నివాళులర్పించారు. పట్టాభి రామ్ బహుముఖ ప్రజ్ఞా శాలిగా, ఇంద్రజాలకుడిగా కాకుండా ఇప్పటి పరిస్థితులుకు అనుగుణంగా కౌన్సిలింగ్ సైకాల జిస్ట్‌గా వేలాదిమందికి ఆయన కౌన్సెలింగ్ ద్వారా ఆరోగ్యం చేకూర్చారన్నారు. మచిలీపట్నంలో మైండ్ కేర్ స్థాపించడానికి కూడా పరోక్షంగా ఆయనే దోహదకారి అని గుర్తు చేసుకున్నారు. మాజీ మున్సిపల్ చైర్మన్ మోటమర్రి బాబా ప్రసాదు, స్థానిక న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పోతురాజు, మల్లికార్జున్, అలాగే సుశీల్ కుమార్, జొన్నలగడ్డ కాంత్, లాల్ బహుదూర్ శాస్త్రి, అర్జున్ రావు, చందమామ బాబు తదితరులు పాల్గొని నివాళులర్పించారు. **ప్రజాశక్తి - గుడివాడ** : ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు డా॥ బి.వి పట్టాభిరామ్ ఆకస్మిక మృతి పట్ల విశ్వభారతి ఇంగ్లీషు మీడియం స్కూల్ చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ గురువారం ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏడాది తమ పాఠశాలలో జరిగే అక్కినేని నాగేశ్వరావు జయంతి కార్యక్రమాలకు పాల్గొనడం జరిగేదన్నారు. తమ పాఠశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం కార్యక్రమాలు పట్టాభిరామ్ పాల్గొని విద్యార్థులకు నూతన ఉత్తేజం అందించేవారన్నారు. ఆయన ఆకాల మృతి బాధాకరమన్నారు.

బందరులో నివాళులర్పిస్తున్న దృశ్యం

సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - పామర్రు : పేద ప్రజలను అన్ని విధాలుగా ఆదుకునేందుకు తన వంతు కషి చేస్తున్నట్లు పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గురువారం నియోజకవర్గ కార్యాలయంలో సీఎంఆర్ఎఫ్ నుండి 30 మంది లబ్ధిదారులకు 21,29,215 రూపాయల విలువ కలిగిన నగదు చెక్కులను అందించారు. ఈ కార్యక్రమంలో పామర్రు పట్టణ టిడిపి అధ్యక్షుడు పరసా సుబ్రహ్మణ్యం, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.



చెక్కును అందిస్తున్న పామర్రు ఎమ్మెల్యే వర్ల

ఆర్థివో కార్యకలాపాలు ప్రారంభం

విజయవాడ: రైతు క్షేమమే ధ్యేయంగా ఎగుమతి నాణ్యత ఉత్పత్తులతో భారత రైతుల కోసం అగ్రికల్చర్ రంగంలో కొత్త ప్రమాణాలను నెలకొల్పిన ఆర్థివో ఆగ్రో కెమికల్ రంగంలో బిటుసి విభాగంలో తన కార్యకలాపాలను ప్రారంభించింది. విజయవాడ నోవాటెల్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆర్థివో క్రాప్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్ జోబి ఈపెన్, సిఇఒ ఎస్.రాధాకృష్ణన్, వైస్ ప్రెసిడెంట్ మలకజప్ప సరవాడ, జిఎం చంద్రశేఖర్ నాగతన్, వీర నారాయణ తదితరులు పాల్గొన్నారు. 1992 నుంచి ప్రపంచ వ్యాప్తంగా 90కి పైగా దేశాల్లో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ట్యాగ్రోస్‌కు ఇది వంద శాతం అనుబంధ సంస్థ అని, ట్యాగ్రోస్ బిటుబి విభాగంలో జపాన్, అమెరికా సహా అనేక ఎంఎన్‌సిలకు సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. నాలుగు అత్యాధునిక తయారీ యూనిట్లు, పూర్తిగా బ్యాక్వర్డ్ ఇంటిగ్రేషన్‌తో ఆర్థిఒ నాణ్యత, విశ్వసనీయత పరంగా ఉత్తమ ప్రమాణాలు పాటిస్తోందన్నారు. భారత రైతులకు ఎగుమతి ప్రమాణాల క్రాప్ ప్రొటెక్షన్, పోషకాహార ఉత్పత్తులు అందించడమే ఆర్థివో ముఖ్య లక్ష్యమన్నారు. వ్యవసాయంలో ఉత్పాదకత, స్థిరత్వం మరియు లాభదాయకతను పెంచడం కోసం ఆర్థివో కట్టుబడి ఉందన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి : తాతయ్య

ప్రజాశక్తి జగ్గయ్యపేట: స్వర్ణాంధ్ర విజన్ 2047 కార్యక్రమంలో భాగంగా పట్టణంలో మున్సిపల్ కార్యాలయంలో గురువారం స్థానిక

శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అధ్యక్షతన నియోజకవర్గ అభివృద్ధి కోసం సెక్టార్ వారీగా స్థూల ఆదాయాన్ని పెంచే విధానాలపై సమీక్ష సమావేశం మండల స్థాయి నియోజకవర్గస్థాయి అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమీక్ష సమావేశంలో ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య మాట్లాడుతూ జగ్గయ్యపేట నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివద్ధి చెందేలా చేయడం మన ప్రధాన లక్ష్యమన్నారు. అగ్రికల్చర్, హార్టికల్చర్, యానిమల్ హస్బెండరీ, ఫిషరీస్ వంటి వ్యవసాయ ఆధారిత రంగాల అభివద్ధి ద్వారా రైతులకు స్థిరమైన ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. పంచాయతీరాజ్, మున్సిపల్, ఆర్ అండ్ బి విభాగాలు గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల మౌలిక సదుపాయాల మెరుగుదలపై దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ ఉమామహేశ్వరరావు, మున్సిపల్ కమిషనర్ తులసి కష్ణారావు, ఎంపీడీవో నితిన్, ఎమ్మార్వో మనోహర్, ఎకాడమీషియన్ కుసుమ కుమారి, పెనుగంచిప్రోలు ఎండిఓ శ్రీను మరియు స్వర్ణాంధ్ర విజన్ 2047 టీమ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణ సమీపంలోని పాలేటివొడ్డున గల మఠం శివాలయం పునర్నిర్మాణానికి భక్తులు సన్నే నాగేశ్వరరావు, వీరి సోదరులు సన్నే శ్రీనివాసరావు మరియు కుటుంబ సభ్యులు సంయుక్తంగా ఆలయ కమిటీ సభ్యులకు 4,11,116 విరాళముగా అందచేశారు.

విద్యార్థులకు కెరీర్ గైడెన్స్

ప్రజాశక్తి జగ్గయ్యపేట: పట్టణంలోని లిటిల్ ఏంజెల్ పబ్లిక్ స్కూల్లో లయన్స్ క్లబ్ జగ్గయ్యపేట, ఎ.పి. లయన్స్ సేవా యజ్ఞంలో భాగంగా సుమారు 200 మంది ఉన్నత పాఠశాల విద్యార్థుల కోసం కెరీర్ గైడెన్స్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లైన్స్ క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ యువ మేధావులను ప్రోత్సహించడం మాకు చాలా ఆనందాన్నిచ్చింది. ఈ కొత్త లయనిస్టిక్ సంవత్సరంలో ఇది మా మొదటి ప్రేరణా కార్యక్రమం మరియు విద్యార్థుల ఉత్సాహం చూడటం నిజంగా సంతప్తికరంగా ఉందన్నారు. విద్యార్థులకు వారి విద్య మరియు వత్తి లక్ష్యాలను స్పష్టంగా నిర్దేశించుకునే ముఖ్యమైన అడుగుల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో క్లబ్ గౌరవ అధ్యక్షులు లయన్ భద్రి శ్రీరామ్, కార్యదర్శి లయన్ సైదా మరియు కోశాధికారి లయన్ రవి కుమార్ హాజరయ్యారు. సీనియర్ లయన్ నాయకులు లయన్ మేజర్ సత్యనారాయణ మరియు లయన్ మోహన్ బాబు, పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికుల నిరసన



నిరసన తెలుపుతున్న భవన నిర్మాణ కార్మికులు

ప్రజాశక్తి-విజయవాడ: బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) సెంట్రల్ సిటీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం సింగ్ నగర్ కష్ణ హోటల్ సెంటర్ వద్ద ఉన్న బిల్డింగ్ వర్కర్స్ సెంటర్‌లో భవన నిర్మాణ కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ కార్యదర్శి యం.బాబురావు భవన నిర్మాణ కార్మికుల హక్కులు కాపాడుకునేందుకు ఈనెల 9న జరిగే సార్వత్రిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. విజయవాడ నగరంతోపాటు ఎన్‌టిఆర్‌జిల్లా వ్యాప్తంగా వేలాది మంది కార్మికులు సరియైన ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, దీనిపై అధికారులను, ప్రజాప్రతినిధులను పలుసార్లు కలిసి వినతిపత్రాలు అందజేసినా ఫలితం ఉండటం లేదని అన్నారు. భవన మరియు ఇతర నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పథకాలను గత ప్రభుత్వం ఇచ్చిన మెమో నెంబర్ 1214 కూటమి ప్రభుత్వం రద్దు చేస్తానని చెప్పి ఇప్పుడు వరకు ఎటువంటి చర్య తీసుకోకపోవడం దుర్మార్గమని అన్నారు. తాము అధికారంలోకి వస్తే ప్రభుత్వం సంక్షేమ బోర్డును పని చేయించి పథకాలను అమలు చేస్తామని కూటమి ప్రభుత్వం గత ఎన్నికల్లో హామీ ఇచ్చి తమ ఎన్నికల మ్యానిఫెస్టోలో కూడా ప్రకటించి, అమలు చేయడం లేదని దుయ్యబట్టారు. అధికారంలోకి వచ్చి సంవత్సరకాలం గడుస్తున్న కూటమి ప్రభుత్వం ఇంకా నిద్ర పోతుందని ఆయన ఆరోపించారు.దేశవ్యాప్తంగా కార్మికులకు అమలవుతున్న పలు కార్మిక చట్టాలను మోడీ ప్రభుత్వం యాజమాన్యాలకు అనుకూలంగా కార్మికులకు వ్యతిరేకంగా 4 లేబర్ కోడ్స్ గా మార్చింది. ఇవి అమలు అయితే సంక్షేమ బోర్డు లు నిర్వీర్యం అవుతాయి. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న కార్మిక వ్యతిరేక విధానాలపై కూటమి ప్రభుత్వం కార్మికులకు సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. నగరంలో కార్మికులు ప్రజలపై రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ భారాలు తీవ్రంగా వేస్తుందని, పైగా బడా పారిశ్రామిక సంస్థలకు లాభం చేకూర్చే విధంగా కార్మికుల అభిప్రాయాలు తీసుకోకుండా ఇళ్లకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగుస్తున్నరు అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఈ స్మార్ట్ మీటర్లు రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే వెనక్కి తీసుకోవాలని లేకపోతే కార్మికుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని రాష్ట్ర ప్రభుత్వం ని హెచ్చరించారు. నిర్మాణరంగంలో అర్హులైన ప్రతి కార్మికుడికి 2 సెంట్లు ఇళ్ల స్థలం ఇవ్వాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ సెంట్రల్ సిటీ ఉపాధ్యక్షులు ఎన్. పవన్ కుమార్ , కమిటీ సభ్యులు రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ జిల్లా గవర్నర్‌గా ఆంజనేయులు

ప్రజాశక్తి-విజయవాడ: సేవా కార్యక్రమాలకు చిరునామాగా లయనిజం ఉందని లయన్స్ ఇంటర్నేషనల్ (డిస్ట్రిక్ట్ -316డి) జిల్లా గవర్నర్‌గా బాధ్యతలు స్వీకరించిన వీవీపీఎస్.ఆంజనేయులు చెప్పారు. స్థానిక లయన్స్ భవన్‌లో, నూతన డి.జీ.టీం.316 కార్యవర్గ సభ్యులు, ప్రమాణస్వీకార కార్యక్రమం బుధవారం జరిగింది. లయన్స్ మాజీ గవర్నర్ గద్దె శేషగిరిరావు నుంచి వీవీపీఎస్ ఆంజనేయులు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ సేవ అక్కడ అవసరమో అక్కడ లయన్స్ క్లబ్ సభ్యులు అక్కడ ఉంటారన్నారు. సేవా కార్యక్రమాలతో పాటుగా పర్యావరణ పరిరక్షణపై అవగాహనా కార్యక్రమాలు, రక్తదానం చేయడం, యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండేలా అవగాహనా సదస్సులు, ఐ. ఓ. ఎల్ క్యాంపులు.ర్యాలీలు నిర్వహించడం వంటి సామాజిక సేవా కార్యక్రమాలకు లయన్స్ క్లబ్ అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రక్తదానం చేయడం వల్ల ప్రాణదాతలుగా మారవచ్చునని అందువల్ల రక్తదానం చేయడంపై తమ అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రచార కార్యక్రమాలు నిర్వహించడమే కాకుండా రక్త,నేత్ర దాన శిబిరాలను కూడా నిర్వహిస్తామన్నారు. లయన్స్ ఫాస్ట్ డిస్టిక్ గవర్నర్ రమణరావు మాట్లాడుతూ లయన్స్ జిల్లా గవర్నర్‌గా ఆంజనేయులు ఎన్నిక అయిన వెంటనే జూలై 1 నుండి లయన్స్ భవన్ పోరంకి లో నిత్య అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. జిల్లా ఫస్ట్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా ఎన్.వి.వీ. ఎస్. ప్రసాద్, సెకండ్ వైస్ డిస్ట్రిక్ట్ గవర్నర్‌గా చెన్నారెడ్డి శ్రీనివాస రెడ్డి,తో పాటుగా క్యాబినెట్ సెక్రటరీగాచక్రధర్, ట్రెజరర్ గా అక్కయ్య నాయుడు ఇతర కార్యవర్గ సభ్యులు బాధ్యతలు స్వీకరించారు. లయన్స్ క్లబ్ జిల్లా నూతన కమిటీ సభ్యులను వివిధ క్లబ్స్ అధ్యక్షులు, కార్యదర్శులు, సభ్యులు సత్కరించి అభినందించారు.

'ఎఐ' పుస్తకావిష్కరణ

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: ప్రస్తుత డిజిటల్ యుగంలో కత్రిమ మేథ కి ఉన్న ప్రాముఖ్యతను దష్టిలో ఉంచుకుని కెబిఎన్ కళాశాల అధ్యాపకులు 'ఆర్టిఫిషియల్ ఇంటిలిజన్స్' పేరుతో రచించిన పుస్తకం అధ్యాపకులకు, పరిశోధకులకు ప్రామాణిక గ్రంథంగా ఉపయోగిస్తుందని ప్రముఖ ప్రచురణకర్త, విజిఎస్ పబ్లిషర్స్ అధినేత శిరం రామారావు అన్నారు. కెబిఎన్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'ఎఐ' పుస్తకావిష్కరణ కార్యక్రమం గురువారం కళాశాలలో జరిగింది. పుస్తకావిష్కరణ చేసిన రామారావు మాట్లాడుతూ డిగ్రీ, పి.జి చదువుతున్న విద్యార్థులకు ఇప్పటివరకూ వారి సిలబస్ కు అనుగుణంగా అధ్యయనం గ్రంథం రాలేదని, ప్రస్తుత పుస్తకం ఆ కొరత తీరుస్తుందన్నారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ఈ పుస్తకం ఆధునిక ఏఐ సిద్ధాంతాలు, మిషన్ లెర్నింగ్, డీప్ లెర్నింగ్, న్యూరల్ నెట్వర్క్స్ వంటి ముఖ్య అంశాలను సులభంగా అర్థమయ్యే విధంగా సమగ్రంగా వివరిస్తుందన్నారు. సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ టి.శ్రీనివాసు మాట్లాడుతూ అధ్యాపకుల్లో రచన, పరిశోధన నైపుణ్యాలు పెంచేదిశగా తమ కళాశాల అధ్యాపకులను ప్రోత్సహిస్తూ, పుస్తక ప్రచురణ చేస్తున్నట్లు చెప్పారు. కళాశాల వైస్ ప్రెసిడెంట్ చిట్టూరి నాగేంద్ర, రీసెర్చ్ సెల్ డైరెక్టర్ డాక్టర్ కె.కిరణ్‌కుమార్, సాయికృష్ణ పాల్గొన్నారు.

బస్టాండ్‌లో కుర్చీలు, ఫ్యాన్లు ఏర్పాటు

ప్రజాశక్తి-విజయవాడ

స్థానిక పిఎన్ బస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సదుపాయాలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ కోరారు. ఈ మేరకు వారు గురువారం ఒక ప్రకటన విడుదల చేస్తూ...నిత్యం సుమారు 1.40 లక్షల మందిప్రయాణికులు పిఎన్ బస్‌స్టేషన్‌లో రాకపోకలు సాగిస్తుంటారన్నారు. ప్రయాణికుల సదుపాయం కోసం 174 ముడూ సీట్ల కుర్చీలు, మరో 13 మూడు సీట్ల కుర్చీలు విజయవాడ యూనియన్ బ్యాంక్ సహకారంతో ఏర్పాటు చేశామన్నారు. వీటితో పాటు మరో 119 మూడు సీట్ల కుర్చీలను కొనుగోలు చేసి, డిపార్చర్ బ్లాక్‌లో ఏర్పాటు చేశామన్నారు. 220 ఆటం బర్డ్ సీలింగ్ ఫ్యాన్లు , వేసవి కాలంలో 14 పెద్ద కూలర్లు ప్రయాణికులు ఎండ తాకిడిని తట్టుకోవడానికి ఏర్పాటు చేశామన్నారు. విశాఖ వారి రాజు వేగేశ్న పౌండేషన్ వారి ద్వారా ప్రయాణికులందరికీ శుద్ధి చేయబడిన మంచినీటిని 24 గంటల పాటు అందుబాటులో ఉంచడం జరిగిందని తెలిపారు.

అధ్వానంగా కోకిలంపాడు రోడ్డు

ప్రజాశక్తి-తిరువూరు: తిరువూరు మండలంలోని కోకిలంపాడు గ్రామంలో తిరువూరు నుండి సరిహద్దు తెలంగాణాలోని గ్రామాల మీదగా అడసర్లడు వెళ్లే రోడ్డు అధ్వానంగా తయారైంది. కురుస్తున్న వర్షాలతో రహదారి పూర్తిగా ధ్వంసమైంది. ఎక్కడ చూసి నా కంకర తేలి, గుంతలుపడి, బురదమయమై న దారులే కనిపిస్తున్నాయి. రోడ్లపై వర్షపు నీటి తో నిండిన గుంతలు కుంటలను తలపిస్తున్నా యి. ముఖ్యంగా కోకిలంపాడు గ్రామంలో ప్రజలు, వాహనదారులు నరకయాతన పడుతున్నారు. వారి బాధలు వర్ణణాతీతంగా మారాయి. అడుగ డుగునా గుంతలు ఉన్న రోడ్డు వెంట ప్రయాణిం చాలంటే భయాందోళన చెందుతున్నారు. ప్రభు త్వం మారి ఏడాది అయినా పాలకులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. కోకిలంపాడులో బుధవారం సాయంత్రం కూటమి సుపరిపాలనలో తొలి అడుగు టీడీపీ కార్యక్రమాన్ని నిర్వహించిన ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు దష్టికి రోడ్డు దుస్థితిని చెప్పితే దాట వేశారే తప్ప అభివద్ధి చేయిస్తామని మాట వరసుకు కూడా చెప్పలేదని టిడిపి కార్యకర్తలే ఆవేదన వ్యక్తం చేశారు. అదే సమయంలో గ్రామానికి చెందిన శీలపు సత్యనా రాయణరెడ్డి బైక్ పై వస్తూ గోతులో పడితలకు గాయమైనా సమీపంలోనే ఉన్న ఎమ్మెల్యే ఏమా త్రం స్పందించలేదని చెప్పారు. అంబులెన్సులో అతన్ని ఆసుపత్రికి తీసుకెకళ్లారాని చెప్పారు. ఇలా ఈ రోడ్డులో వెళ్లే వాహనదారుల్లో రోజుకు ఇద్దరు, ముగ్గురు గోతుల్లో పడి గాయాలపాలవు తున్నారని గ్రామస్తులు తెలిపారు. ప్రతిరోజు కోకి లంపాడు గ్రామంతో పాటు సరిహద్దు తెలంగాణా గ్రామాల ప్రజలు నియోజక కేంద్రమైన తిరువూ రు పట్టణానికి ప్రభుత్వ కార్యాలయాలకు, ఆసుపత్రులకు, నిత్యావసర సరుకులే కాకుండా విద్యార్థులు స్కూల్, కళాశాలలకు ఈరోడ్డు మీ దుగా రాకపోకలు సాగిస్తుంటారు. ఇంత రద్దీగా ఉండే ఈ రహదారిని అభివద్ధి చేయటంలో అధికారులు గానీ, ప్రభుత్వానికి చెందిన ప్రజా ప్రతినిధులు గానీ పట్టించుకోవటం లేదని వాహ నదారులు ఆవేదన చెందుతున్నారు. ఈరహదా రిపై ఒకటి, రెండు సార్లు వెళితే నడుమనొప్పులు వస్తున్నాయి వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే చొరవ తీసుకొని రోడ్డును త్వరితగతిన అభివృద్ధి చేయించి ప్రాణాలను కాపాడాలని వాహనదారులు కోరుతున్నారు.

జాతీయ రహదారి వెంట ఆక్రమణలు తొలగించాలి : కలెక్టర్

ప్రజాశక్తి-గన్నవరం : గన్నవరం విమానాశ్రయం నుండి బుడమేరు వంతెన వరకు జాతీయ రహదారిలో గుంతలు లేకుండా పచ్చదనం పెంపొందించాలని, ఆక్రమణలు ఉంటే తొలగించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. గురువారం జిల్లా కలెక్టర్ గన్నవరం విమానాశ్రయం నుండి బుడమేరు వంతెన వరకు పలుమార్లు అటు ఇటు కాలినడకన తిరిగి అధికారులకు పలు సూచనలు చేశారు. రహదారి మార్గంలో ఉన్న పగుళ్లను, గుంతలను గుర్తించి వెంటనే వాటిని పూడ్చి రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా సరి చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. రహదారి మార్గంలో ఇరువైపులా కుండీలలో మొక్కలను ఏర్పాటు చేసి పచ్చదనం పెంపుదలకు కషి చేయాలని సూచించారు. దెబ్బతిన్న కుండీలను తొలగించి వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలన్నారు. రహదారి వైపుకు విస్తరించి ఉన్న పొదలను తొలగించాలని, పనిచేయని వీధిదీపాలను తొలగించి వాటి స్థానంలో కొత్త విద్యుత్ దీపాలను వేసి అన్ని దీపాలు వెలిగేలా చూడాలన్నారు. రహదారి మార్గంలో డివైడర్ ల వద్ద చెత్తాచెదారాలను తొలగించి శుభ్రంగా ఉంచాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ గన్నవరం విమానాశ్రయం నుండి బయటకు వచ్చాక పచ్చదనం పెంపొందించుటకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట అమరావతి అభివద్ధి సంస్థ చైర్ పర్సన్ లక్ష్మీ పార్థసారథి, జాతీయ రహదారి పీడీ విద్యాసాగర్, గన్నవరం తహసిల్దారు శివయ్య, ఎంపీడీవో స్వర్ణలత, తదితర అధికారులు పాల్గొన్నారు.

రహదారి పక్కనే పెరిగిన పిచ్చిచెట్లను పరిశీలిస్తున్న కలెక్టర్



నిత్యాన్నదానానికి లక్ష విరాళం

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలో ఉన్న శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామిని గురువారం చెన్నై వాస్తవ్యులు టిటిడి బోర్డు మెంబర్ దంపతులు కష్ణమూర్తి, అనురాధ లతోపాటు యానం మాజీ మంత్రి, ప్రస్తుతం పాండిచ్చేరి ఢిల్లీ అధికార ప్రతినిధి మల్లాడి కృష్ణారావు దర్శించుకున్నారు. వీరికి దేవస్థానం ఆలయ సూపరిండెండెంట్ బొప్పన సత్యానారాయణ, వేద పండితులు, అర్చక స్వాములు, ఆలయ సిబ్బంది స్వాగతం పలికారు. ముందుగా నాగ పుట్టలో పాలు పోసి మొక్కుబడ్లు చెల్లించుకున్నారు. శ్రీ వల్లీ దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి నిత్యాన్నదానానికి కష్ణ మూర్తి అనురాధ దంపతులు 1,00,116 రూపా యలు విరాళంగా అందించారు. అనంతరం స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

డాన్స్ పోటీల్లో 'ఏఎన్ఎం' స్కూల్ విద్యార్థిని ప్రతిభ

ప్రజాశక్తి - పామర్రు : అంతర్జాతీయ డాన్స్ పోటీలలో పామర్రుకు చెందిన విద్యార్థిని షాహిదున్ని తృతీయ స్థానం సాధించింది. శ్రీ రాధాకష్ణ కళాక్షేత్రం రాజమండ్రి వారు నిర్వహించిన అంతర్జాతీయ మ్యూజిక్, డాన్స్ పోటీలలో పామర్రు ఏఎన్ఎం హైస్కూల్ కి చెందిన విద్యార్థిని షాహిదు న్నిసా అత్యంత ప్రతిభ కనపరిచి మూడో స్థానంలో విజయం సాధించింది. విద్యార్థినిని హైస్కూల్ ప్రిన్సిపల్ ఏ పూర్ణచంద్రారెడ్డి తదితరులు అభినందించారు.

సభలో ప్రసంగిస్తున్న శీలం నారాయణరావు

కోటేశ్వరరావు పోరాటాలను ఆదర్శంగా తీసుకోవాలి

- సిపిఎం కృష్ణాజిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శీలం నారాయణరావు

ప్రజాశక్తి - పామర్రు : బరిగెల కోటేశ్వరరావు 22వ వర్ధంతి సభ పామర్రు సిపిఎం ఆఫీసులో గురువారం ఘనంగా జరిగింది. ఈ సభకు పామర్రు సిపిఎం కార్యదర్శి ఒడుగు గంగాధర్ అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా పార్టీ నాయకులు శీలం నారాయణ, ఎం.శివ నాగేంద్రంలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా శీలం నారాయణ మాట్లాడుతూ బరిగెల కోటేశ్వరావు నాడు చేసిన పోరాటాలు ఈనాటి తరం ఆదర్శంగా తీసుకోవాలని, నేడు పాలకులు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని పోరాటాలు చేయాలని పిలుపు నిచ్చారు.శివ నాగేంద్ర మాట్లాడుతూ మోడీ అనుసరిస్తున్న విధానాల వల్ల భారత దేశంలో రైతాంగం,కార్మిక వర్గం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని, ఈ విధానాలకు ఇలాగే కొనసాగితే భారతదేశంలో సంక్షోభం తప్పదని అన్నారు. ఈనాడు మన ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని బరిగెల కోటేశ్వరావు స్ఫూర్తితో జులై 9న జరిగే దేశవ్యాప్త సమ్మెలో మీరందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. తొలుత బరిగాల కోటేశ్వర రావు చిత్రపటానికి ప్రముఖ డాక్టర్ సురేష్ చంద్ర రెడ్డి పూలమాలవేసి నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో దళిత పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రాయవరపు వెంకటేశ్వరావు, డాక్టర్ సురేష్ చంద్ర రెడ్డి.బరిగెల భీమేశ్వరరావు. నీలం మురళీ కష్ణారెడ్డి, వేము పెదబాబు, జంపుల కోటేశ్వరరావు, చాట్ల రాంబాబు, కొక్కిలిగడ్డ లక్ష్మణ,డి.రఘునాధ రావు,రత్నం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా బదిలీలు నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలపై జిఓ 5ను ఉల్లంఘించారని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా శాఖ ఆద్వర్యంలో గురువారం జిల్లా జాయింట్ కలెక్టర్ గీతాంజలి శర్మ కు వినతి పత్రం అందించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఇటీవల చేపట్టిన గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు ప్రభుత్వ ఆదేశాలకు విరుద్ధంగా జరిగాయని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం కృష్ణా జిల్లా శాఖ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ బదిలీల్లో పారదర్శకత కొరవడిందని, నిబంధనలను పక్కనపెట్టి బదిలీలు చేశారని, దీనివల్ల చాలా మంది ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. కాబట్టి 05 లోని మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటించి, నిబంధనలకు విరుద్ధంగా జరిగిన బదిలీలను వెంటనే పునఃసమీక్షించి తిరిగి పారదర్శకంగా బదిలీలు నిర్వహించా లని కోరారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఏపీజిఇఏ, కష్ణా జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ జి. శ్రీనివాస్ రావు, వైస్ ప్రెసిడెంట్ కె. లోకేష్, సంయుక్త కార్యదర్శి జి. రామకష్ణ, మహిళా వింగ్ వైస్ ప్రెసిడెంట్ పల్లా రేఖ, చట్రగడ్డ మేరీ రాజు ఉన్నారు.

రూ.3.16 కోట్లతో రహదారుల నిర్మాణం : ఎంఎల్ఏ

ప్రజాశక్తి-అవనిగడ్డ : నియోజకవర్గంలో రూ 3.16 కోట్లతో తారురోడ్లు వేస్తున్నట్లు నియమిస్తున్నట్లు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. గురువారం గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులు రూ 76 లక్షలతో ఆర్టీసీ డిపో నుంచి ఏ ఎస్ ఆర్ ఫంక్షన్ హాల్ వరకు 1040 మీటర్ల నూతన తారు రోడ్డు నిర్మాణానికి బుద్ధప్రసాద్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఉపాధి హామీ నిధులతో ఇప్పటివరకు నియోజకవర్గంలో రూ 33.24 కోట్లతో 46.785 కిలోమీటర్ల మేర 5 22 సిసి రోడ్లు నిర్మించినట్లు చెప్పారు. వీటిలో అవనిగడ్డ మండలంలో రూ 5.94 ఓట్లతో 9 కిలోమీటర్ల మేర 111 సిసి రోడ్లు, అవనిగడ్డ గ్రామంలో రూ రెండు కోట్ల 19 లక్షల 70 వేల తో 3.6 కిలోమీటర్ల మేర 36 సీసీ రోడ్లు నిర్మించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో అన్ని ప్రధాన రహదారులు అభివద్ధి చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు యాసం చిట్టిబాబు, ఎంపీపీ తుంగల సుమతీ దేవి, గ్రామ సర్పంచ్ గో రుముచ్చు ఉమా, ఎంపీడీవో ఎం మరియా దేవి, పంచాయతీ రాజ్ డి ఈ ఈ పగడాల సురేష్ బాబు, ఎంపీటీసీ సభ్యులు బొప్పన భాను, తోట గణేష్ ,మండల కోఆప్షన్ సభ్యులు షేక్ నజీర్ భాష తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎంఎల్ఏ

6న శాకాంబరిగా అలంకారం

కొండలమ్మను దర్శించుకున్న జనసేన నాయకులు శ్రీకాంత్ కుటుంబసభ్యులు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : జిల్లాలో ప్రసిద్ధిగాంచిన మండలంలోని వేమవరం గ్రామంలో శ్రీ కొండలమ్మ అమ్మవారి దేవస్థానంలో ఈనెల 6వ తేదీ ఆదివారం ఆషాడమాసం సందర్భంగా అమ్మవార్లకు శాకాంబరి అలంకారం జరుగుతుందని ఆలయ కార్య నిర్వహణ అధికారి ఆకుల కొండలరావు ఒక ప్రకటన తెలిపారు. ఉదయం 9 గంటల నుండి శ్రీ అమ్మవారికి వివిధ రకాలైన కూరగాయలతో, పండ్లతో శాకాంబరి అలంకార దర్శనం జరుగుతుందన్నారు. అనంతరం నీరాజన మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం జరుగుతున్నారు. యాత్రికులు వేలాదిగా పాల్గొనాలని ఆయన కోరారు.

అలాగే మండలంలోని వేమవరం గ్రామంలో ఉన్న శ్రీ కొండలమ్మ అమ్మవారిని గుడివాడ నియోజకవర్గం జనసేన పార్టీ అధ్యక్షులు బూరగడ్డ శ్రీకాంత్ కుటుంబ సభ్యులతో కలిసి గురు వారం దర్శించుకున్నారు. వారిని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు, అర్చక స్వాములు స్వాగతం పలికి పూజలు చేయించి శాలువాతో సత్కరించారు.

ఇన్చార్జి ఎంపిడిఒను అభినందిస్తున్న కార్యాలయ ఉద్యోగులు

ఎంపిడిఒకు అభినందనలు

ఈవోపిఆర్‌డి నరసింహారావు

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండల కేంద్రమైన గుడ్లవల్లేరు గ్రామపంచాయతీ స్పెషల్ ఆఫీసర్, ఇంచార్జి ఎంపిడిఒగా నియమితులైన ఎండి ఇమ్రాన్‌ను స్థానిక సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ పిఓపిఆర్డి ఏజేయల్ నరసింహారావు, గుడ్లవల్లేరు పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే గుడ్లవల్లేరు మండల పరిషత్ ఇంచార్జ్ ఈవో పీఆర్డిగా ఏజేఎల్ నరసింహారావు నియమితులయ్యారు. నరసింహారావుకు మండలంలోని పలువురు ప్రజా ప్రతినిధులు, అధికారులు, పంచాయతీ కార్యదర్శులు అభినందనలు తెలిపారు.

ర్యాలీ చేస్తున్న సిబ్బంది

క్షయ వ్యాధిపై అవగాహన కలిగి ఉండాలి

ప్రజాశక్తి-గన్నవరం : క్షయ వ్యాధి లక్షణాలు పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని స్థానిక పిహెచ్సి ముస్తాబాద్ వైద్యాధికారిని డాక్టర్ సుజనా అన్నారు. టిబి ముక్తభారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గురువారం స్థానిక గన్నవరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్ నందు టీ బిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. రెండు వారాలకు మించి దగ్గు ఉండటం, జ్వరంరావటం, రాత్రి వేళలో చెమటలు పట్టడం, కళ్లలో రక్తం పడటం, ఛాతిలో నొప్పి, శ్వాస తీసుకోవటంలో ఇబ్బంది పడటం, బరువు తగ్గటం, ఆకలి లేకపోవడం, అలసట ఉండటం, మెడ మీద గడ్డలు ఉండటం వంటి లక్షణాలలు ఉంటే ఆలస్యం చేయకుండా కళ్ళె పరీక్ష లేదా చెస్ట్ ఎక్స్రే వంటివి చేయించుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిస్ట్రిక్ కోఆర్డినేటర్ చిన్ని కష్ణ, స్థానిక టీబీ సిబ్బంది సాంబశివరావు, టీ బి సూపర్వైజర్ రఘు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కరించాలి

ఎపి ఎన్‌జిజిఒ జెఎసి ఛైర్మన్ విద్యాసాగర్

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని ఏపీ ఎన్జీజీవో జేఏసీ ఛైర్మన్ అలపర్తి విద్యాసాగర్ అన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల ఐక్య కార్యాచరణ సమితి (జేఏసీ) నూతన ఛైర్మన్‌గా విద్యాసాగర్, డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా డివి రమణ ఎన్నికయ్యారు. ఎన్నిక అనంతరం గురువారం గాంధీనగర్‌లోని ఎన్జీజిఒ హోమ్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏకగ్రీవంగా తన అభ్యర్థిత్వానికి మద్దతు పలికిన వారికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పదవిని బాధ్యతగా భావిస్తున్నానన్నారు. గత ప్రభుత్వంలో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్రంగా వివిధ రూపాల్లో నష్టపోయిన అంశాన్ని దృష్టిలో పెట్టుకుని ఎన్నికలలో నూతన ప్రభుత్వానికి మద్దతు పలికామన్నారు. అపరిష్కృతంగా ఉన్న తమ సమస్యలను నిర్ణీత వ్యవధిలో పరిష్కరిస్తామని కూటమి ప్రభుత్వం మేనిఫెస్టోలో సైతం ప్రకటించిందని గుర్తు చేశారు. ప్రస్తుతం ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన ఆర్థిక విధ్వంసాన్ని దృష్టిలో పెట్టుకొని నూతన ప్రభుత్వానికి ఏడాది కాలం సమయం ఇచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎదుర్కొంటున్న ముఖ్యమైన సమస్యలను ఇప్పటికే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామన్నారు. ప్రభుత్వం దృష్టి సారించకపోవడంతో ప్రభుత్వ ఉద్యోగులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ జెఎసి సెక్రెటరీ జనరల్ ప్రసాద్, జేఏసీ సంఘాల నేతలు రఘునాథరెడ్డి, వై.శ్రీనివాసరావు, బండి శ్రీనివాసరావు, జి.హృదయరాజు, ఎన్.చంద్రశేఖర్, పివి సాయికుమార్, రవీంద్ర, సిహెచ్.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యాసాగర్, రమణను అభినందిస్తున్న ఉద్యోగులు

ఇంజినీరింగ్ కార్మికులపై బెదిరింపులు ఆపాలి : సిఐటియు

ప్రజాశక్తి-తిరువూరు: సమ్మెలోకి వెళితే తొలగిస్తామని బెదిరించడాన్ని నిరసిస్తూ తిరువూరు నగర పంచాయతీ కార్యాలయం ముందు ఇంజనీరింగ్ కార్మి కులు గురువారం ధర్నా చేశారు. తమ సమస్యలు పరిష్కరించాలని, లేనియెడల ఈనెల పదవ తేదీ నుండి సమ్మె చేస్తామని కార్మికులు ఆయా మున్సిపాలిటీల కమిషనర్లకు సమ్మె నోటీసులు ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం పరిష్కరించలేదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు బి. వెంకటేశ్వర రావు తెలిపారు. గత నెల రోజుల నుంచి వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్న మున్సిపల్ ఇంజనీ రింగ్ కార్మికులు రాష్ట్రవ్యాప్తంగా కొన్ని మున్సిపా లిటీలలో కార్మికులు సమ్మెలోకి వెళ్లడం జరిగిందన్నారు. మిగిలిన మున్సిపాలిటీల కార్మికులు శుక్రవారం విజయవాడ బహిరంగ సభ వెళ్ళి తర్వాత సమ్మెకు వెళతామని చెప్పడంతో రాష్ట్ర సీఎండి కమిషనర్ల ద్వారా మీరు సమ్మెలోకి వద్దని బెదిరిస్తున్నారని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం బెదిరింపులు ఆపి కార్మికుల సమస్య లు పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీరింగ్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు షేక్ బాజీ, కందుల శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు వాసు, సలహాదారుడు మోహన్, కోశాధికారి రఫీ, మోదుగు గోపి, మస్తాను, సుజాత, ఇంజనీరింగ్ కార్మికులు పాల్గొన్నారు.

రీసర్వే ద్వారా పన్ను మార్చాలి : డిసిఆర్

ప్రజాశక్తి-విజయవాడ: ఇంటి మార్పు కనుగుణంగా రీ-సర్వే చేసి, తద్వారా పన్నులను మార్పు చేసి, వసూలు చేయాలని డిప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) డిసిఆర్ జి సృజన అన్నారు. విఎంసి నూతన భవనంలోని మీటింగ్ హాల్లో రెవెన్యూ సిబ్బందితో డిసిఆర్ గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల ప్రకారం పన్నుల విధానంలో మార్పు చేయాలని కోరారు. నగరంలో జరుగుతున్న సర్వేను వేగవంతం చేయాలన్నారు. నగరంలోని ఖాళీ స్థలాలు, ఖాళీ స్థలాలుగానే ఉన్నాయా లేదా వాటి పైన ఇల్లు నిర్మించారా, ఒకవేళ ఇళ్లను నిర్మిస్తే వాటికి తగ్గట్టుగా ఖాళీ స్థలాల పన్నును ఇంటి పన్నుకి మార్చాలని, ఇంటి పన్నులు ఉన్న అసెస్మెంట్లకు నగరపాలక సంస్థ జారీ చేస్తున్న డిమాండ్ కు తగ్గట్టుగా ఉందా లేదా, ఒకవేళ అదనముగా రూములు నిర్మించిన, ఫ్లోర్లు నిర్మించిన, ఆ మార్పుకు తగ్గట్టుగా పన్నును ఈ సర్వే ద్వారా మార్చాలని అన్నారు. అడ్మిన్ సెక్రటరీలు ఫీల్డ్ వెరిఫికేషన్ చేసి కచ్చితంగా ఈ సర్వేను పూర్తి చేయాలని అన్నారు. అలాగే ప్రజలు కూడా సిబ్బంది తమ వద్దకు వచ్చినప్పుడు సహకరించాలని, పన్నులను సకాలంలో చెల్లించి నగరాభివద్ధికి తోడ్పడాలని కోరారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కమిషనర్లు హెలెన్, బి. శ్రీనివాసరావు, ఏ యూ బి శర్మ, రెవెన్యూ ఆఫీసర్లు, ఇన్స్పెక్టర్లు, అడ్మిన్ సెక్రటరీలు పాల్గొన్నారు.

మాధవరెడ్డికి అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి-గంపలగూడెం: కొత్తపల్లికి సిపిఎం కార్యకర్త బొమ్మారెడ్డి మాధవరెడ్డి మృతి పట్ల పలువురు సంతాపం తెలియజేస్తూ ఘనంగా నివాళులర్పించారు. ఎన్టీఆర్ జిల్లా సిపిఎం కార్యదర్శి డివి కృష్ణ ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులతో మాట్లాడి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మేకల నాగేంద్ర ప్రసాద్, మండల కార్యదర్శి మద్ది రెడ్డి వెంకటరెడ్డి, గ్రామ టిడిపి అధ్యక్షుడు గువ్వల వెంకటేశ్వర్ రెడ్డితో పాటు పలువురు వైసిపి నాయకులు మాధవరెడ్డి భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం మాధవరెడ్డి అంత్యక్రియలు నిర్వహించారు.



ధర్నాను జయప్రదం చేయాలి : సత్యబాబు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శుక్రవారం చేపట్టిన పోరుబాట కార్యక్రమంతో పాటు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులను బానిసలుగా చేస్తూ తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్ లీడర్ బోయి సత్యబాబు పిలుపునిచ్చారు. ఈ మేరకు గురువారం పశ్చిమ నియోజకవర్గం వన్ టౌన్ లోని రమణయ్య కూల్ డ్రింక్ షాప్, పాత శివాలయం సెంటర్ తో పాటు భవానిపురం ఐరన్ యార్డ్, రోటరీ నగర్ లలో విస్తత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఠా కార్మికుల సంక్షేమం కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చిత్తశుద్ధితో పనిచేయాలని విజ్ఞప్తి చేశారు. అసంఘటిత రంగ కార్మికులైన ముఠా కార్మికులు, వారి కుటుంబాల భద్రత కోసం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కేంద్ర ప్రభుత్వం పారిశ్రామిక దిగ్గజం అదానికి వత్తాసు పలుకుతూ రాష్ట్రంలోని ప్రతి ఇంటికి స్మార్ట్ మీటర్ల బిగింపు ప్రక్రియ చేపట్టిందన్నారు. ఇప్పటికే నెలవారి విద్యుత్ బిల్లుల భారాలతో విలవిలలాడుతున్న కరెంటు వినియోగదారులు ముక్తకంఠంతో స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా ఐదో నెంబర్ రూట్ రమేష్ హాస్పటల్ ఎదురుగా గల ఎపిఎస్పిడిసిఎల్ కార్యాలయం ఎదుట శుక్రవారం తలపెట్టిన పోరుబాట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలన్నారు.

హత్య కేసులో నిందితులు అరెస్టు

ప్రజాశక్తి-తిరువూరు: ఏ.కొండూరు మండలం, కొత్తరేపూడి తండాలో ఇటీవల జరిగిన హత్య అక్రమ సంబంధం నేపథ్యంలో పథకం ప్రకారం జరిగిందని మైలవరం ఏసిపి వై. ప్రసాదరావు తెలిపారు. హత్య కేసు వివరాలను ఆయన గురువారం తిరువూరు సీఐ కార్యాలయంలో విలేకర్లకు వెల్లడించారు. తూర్పు మాధవరం గ్రామానికి చెందిన చార్లెస్ కూన పరాజు గ్రామానికి చెందిన బత్తుల కుమారితో చాలా కాలంగా అక్రమ సంబంధం కొనసాగిస్తు న్నాడు. అయితే మతుడైన రెడ్డిగూడెం మండ లం, ముద్దులపర్వ గ్రామానికి చెందిన కోట రాము తనతో కూడా శారీరక సంబంధం పెట్టుకో మని కుమారిని వెంటపడుతున్నాడు. దీనితో కుమారి నిరాకరించింది. ఆమె చార్లెస్ కలిసి రాముని మందలించారు. అయినా మార్పు రాక పోవడంతో అతన్ని అడ్డు తొలగించుకునేందుకు హత్యా కు ప్లాన్ చేశారు. అందులో భాగంగా కుమారి రాముకి మాయ మాటలు చెప్పి కొత్త రేపూడి గ్రామ శివారు మామిడి తోట దగ్గరకు గత నెల 29వ తేదీన తీసుకుని వెళ్ళింది. ముందుగా అనుకున్న దాని ప్రకారం కొద్ది సమ యానికి చార్లెస్ అక్కడకు చేరుకొని బలమైన కర్రతో రాముని తలమీద కొట్టడంతో అతను అక్కడికక్కడే చనిపోయాడు. అనంతరం ఇద్దరు కలిసి పారిపోయారు. భార్య వెంకటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏ కొండూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోద చేసి దర్యాప్తు చేస్తున్న క్రమంలో నిందుతులు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి జ్యుడీషియల్ రిమాండ్ విధించినట్లు ఏసిపి తెలిపారు. విలేకర్ల సమావేశంలో సీఐ గిరిబాబు, ఎస్ఐ. సిహెచ్.కృష్ణ పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

భవానీపురం 42 ప్లాట్ల బాధితులు

ప్రజాశక్తి-విజయవాడ సిటీ : 24 ఏళ్ల క్రితం భవానీపురంలో 2.17 ఎకరాల స్థలాన్ని 42 ప్లాట్లుగా కొనుగోలు చేశారు. వారందరూ సొంతింటి కల సాకారం అయ్యిందనుకున్నారు. ఆ ఆనందం కొద్ది రోజుల్లోనే అవిరైంది. తాము మోసపోయామని తెలుసుకున్న వారు తమకు న్యాయం జరగకపోతే మరణమే శరణ్యమని వాపోతున్నారు. జరిగిన మోసాన్ని అటు ప్రభుత్వ పెద్దలకు ఇటు ఉన్నతాధికారులకు మొరపెట్టుకున్నా ఫలితం శూన్యమని కన్నీటి పర్యంతం అవుతున్నారు. భవానీపురం రామ రాజ్యనగర్ కరెంటు ఆఫీసు కార్యాలయం రోడ్డులో 42 ప్లాట్ల బాధితులు గురువారం విలేకరులతో మాట్లాడారు. 2001లో మజీద్ అనే వ్యక్తి నుంచి 42 ప్లాట్లుగా భూమిని కొనుగులు చేసినట్లు తెలిపారు. 17 సంవత్సరాల తరువాత శ్రీ లక్ష్మి రామ కో ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ లిమిటెడ్ 2728 అనే పేరుతో తాము కొనుగోలు చేసిన స్థలాలు తమవంటూ నోటీసులు పంపిస్తున్నారని తెలిపారు. గతంలో ఈ స్థలాన్ని శ్రీ లక్ష్మీ రామా కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ కోర్టు ద్వారా దక్కించుకున్న విషయాన్ని తమకు వెల్లడించకుండా ఆ స్థలాన్ని వెంచర్ రూపంలో ప్లాట్లుగా విభజించి 42 మందికి అమ్మారని వివరించారు. ఇవేమీ తెలియని తాము ప్లాట్లు కొనుగోలు చేసి పక్కా గృహాలు నిర్మించుకుని నివసిస్తున్నామని, నేడు ఈ స్థలాలకు నోటీసులు పంపించడంతో తమ జీవితాలు రోడ్డున పడ్డాయని వాపోతున్నారు. తమకు న్యాయం జరగకపోతే ఆత్మహత్యకు సిద్ధమంటూ 42 ప్లాట్ల బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమావేశంలో తంగా రవికుమార్, రమణారెడ్డి, మురళీకృష్ణ, గోదావరి బాబు, నాగరాజు, పూర్ణ పాల్గొన్నారు.

పారిశుధ్య పనులు చేపట్టాలని వినతి

ప్రజాశక్తి-విస్సన్నపేట: సీజనల్ వ్యాధిల నుండి ప్రజలను కాపాడాలని పారిశుధ్య చర్యలు చేపట్టాలని కోరుతూ స్థానిక పంచాయతీ ఆఫీస్ నందు గురువారం జరిగిన గ్రామ సభ కార్యక్రమంలో విస్సన్నపేట గ్రామ అధికారి ఈవో హరి కృష్ణకుమార్‌కు, గ్రామ సర్పంచ్ సాదుపాటి నాగమల్లేశ్వరి కి సిపిఎం మండల కార్యదర్శి నాగరాజు వినతిపత్రం ఇచ్చారు. విస్సన్నపేట గ్రామములో పారిశుధ్య సమస్య చాలా తీవ్రంగా ఉందని డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం ప్రధాన కారణమని అలాగే దోమలు పెరుగుతున్నందున వెంటనే దోమల నివారణ చర్యలు చేపట్టాలని దోమల మందు పిచికారి చేయాలని అలాగే చాలా చోట్ల వీధి కుక్కలు పిల్లల మీద దాడి చేస్తున్నాయని వాటిని పట్టించి ఊరికి దూరంగా వదిలేయాలని అలాగే పందులను కూడా పట్టించే ఊరికి దూరంగా ఉంచాలని విస్సన్నపేట గ్రామ మెయిన్ రోడ్ లో పశువులు వలన వాహనదారులు పాదాచార్యులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వాటిని కూడా పట్టించి ఊరికి దూరంగా పంపించాలని ఆయన ఈ సందర్భంగా అధికారులను కోరారు.

నిత్యాన్నదానికి విరాళం

ప్రజాశక్తి-వత్సవాయి: విజయవాడ నగరం విజయనగర్ కాలనీ గుణదల వాస్తవ్యులు శ్రీ రావూరి సుబ్బారావు, అల్లూరమ్మ దంపతులు కుటుంబ సమేతంగా శ్రీ తిరుపతమ్మ అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకొని శ్రీ అమ్మవారి దేవస్థానం నిత్య అన్నదాన పథకమునకు 50 వేల రూపాయలు గో సంరక్షణకు 50 వేల రూపాయలు విరాళములు ఆలయ కార్య నిర్వహణ అధికారి శ్రీ బీహెచ్ వి ఎస్ న్ కిషోర్ కుమార్ సూచనల మేరకు ఏఈవో శ్రీ జంగం శ్రీనివాసరావుకు అంద చేశారు. వారికి ఆలయ ఇన్స్పెక్టర్లు మన్నెం నరసయ్య, బద్దుల కష్ణమోహన్ ఆలయ అర్చకులు వేద పండితులచే వేద ఆశీర్వచనం చేసి అమ్మవారి శేష వస్త్రములు తీర్థ ప్రసాదములు అందజేశారు.

నిందితునికి జైలు

ప్రజాశక్తి-వత్సవాయి: పోక్సో కేసులో నేరం రుజువు కావడంతో గ్రామానికి చెందిన ఓర్సు కిషోర్ కు సంవత్సరాలు జైలు శిక్ష, మూడు వేల రూపాయలు జరిమానా విధిస్తూ ఫోక్సో కోర్టు సెషన్స్ జడ్జి తీర్పు చెప్పారని పెనుగంచిప్రోలు ఎస్సై ఎమ్మెస్ కే అర్జున్ తెలిపారు. 2020 డిసెంబర్‌లో ఆ గ్రామానికి చెందిన బాలిక ఇంట్లో ఒంటరిగా ఉన్న సమయంలో కిషోర్ లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనపై అప్పుడే ఎస్ఐ జి రామకృష్ణ కేసు నమోదు చేసి నిందితుడు కిషోర్ ను అరెస్టు చేసి జగ్గంపేట కోర్టులో హాజరుపరిచారు. కేసు విచారణ అనంతరం నేరం రుజువు కావడంతో కిషోర్ కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ జడ్జి తీర్పు చెప్పారు

మెకానిక్ డే వేడుకలు

ప్రజాశక్తి - గుడివాడ : మెకానిక్ డే సందర్భంగా గురువారం పట్టణంలోని మెకానిక్‌లు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. పట్టణంలోని వృద్ధుల ఆశ్రమంలో, ఆసుప్రతులలోని రోగులకు, వృద్ధులకు రొట్టెలు, పండ్లు పంపిణి చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిలుగా ఐడిఎఫ్‌సి బ్యాంక్ మేనేజర్ బాజానీ పాల్గొని మెకానిక్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. మెకానిక్ యూనియన్ ప్రెసిడెంట్ దుర్గారావు, వైస్ ప్రెసిడెంట్ దిలీప్, సెక్రటరీ రజాక్‌భాష , కోశాధికారి సురేష్, వాకర్స్ యూనియన్ సభ్యులు సూర్యనారాయణ, జీఎస్టీ భాషా, ఖాదర్ బేగ్ తదితరులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-చల్లపల్లి :** చల్లపల్లి మోటర్ సైకిల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక ఆటోనగర్ ప్రాంతంలో గురువారం మెకానిక్ డే ఘనంగా నిర్వహించారు. మోటార్స్ సైకిల్ మెకానిక్ వెల్ఫేర్ అసోసియేషన్ గౌరవా ధ్యక్షులు ఉప సర్పంచ్ మమ్ముని రాజకుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని కేకు కట్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ టూ వీలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నభి ఘోరి, చల్లపల్లి మండల అధ్యక్ష కార్యదర్శులు కొల్లూరు చంద్, తుమ్మల చంద్రశేఖర్, ఆటోనగర్ అసోసియేషన్ అన్వర్ బాషు, నాయకులు ఉస్మాన్ షరీఫ్, రాజన్,బాబురావు, సుబ్బారావు, ఘంట సాల, చల్లపల్లి, మోపిదేవి, మండలాల మెకానికులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-బంటుమిల్లి :** బంటుమిల్లి మండలంలో గురువారం ఘనంగా మెకానిక్ డే వేడుకలు జరిగాయి. మెకానిక్ లకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరుతూ యువ గణేష్ మోటార్ సైకిల్ మెకానికల్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు స్థానిక ఎమ్మార్వో కాగిత పూర్ణచంద్రరావుకి వినతిపత్రం అందజేశారు. తదనంతరం గవర్నమెంట్ స్కూల్ విద్యార్థు లకు బుక్స్, చాక్లెట్లు, పెన్నులు అందించారు. బంటుమిల్లి మెకానిక్ లు, కత్తివెన్ను మెకానిక్ లు కూడా పాల్గొన్నారు

నటుడు ఎస్‌వి రంగారావుకు ఘన నివాళి

ప్రజాశక్తి - పామర్రు : ప్రముఖ సినీ నటుడు, కృష్ణాజిల్లా వాసి ఎస్.వి. రంగారావు 107వ జయంతి పామర్రులో గురువారం ఘనంగా జరిగింది. స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో ఘంటసాల కళాపీఠం అధ్యక్షుడు కాటూరి మురళీకష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కళాకారుడు కోడూరు ఆంజనేయులును ఘనంగా సన్మానించారు.కళాపీఠం సభ్యులు,సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ సభ్యులు చిన్నం ఆదినారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు సన్మానం

ప్రజాశక్తి-నందిగామ: పోలీస్ స్టేషన్ నుండి బదిలీ పై వెళ్తున్న 6గురు కానిస్టేబుల్స్ కు గురువారం నందిగామ సినిమా వైవిఎల్ నాయుడు సన్మానం చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో విధి నిర్వహణలో భాగంగా ఇన్నాళ్లుగా క్రమశిక్షణ బాధ్యతతో విధి నిర్వహణలో విశేష సేవలను అందించి బదిలీపై వెళ్తున్న కానిస్టేబుళ్ల కు పుష్పగుచ్ఛాలతో శాలువాలతో సత్కరించారు.మరో స్టేషన్ పరిధిలో కూడా ప్రజలకు విశేష సేవలు అందించాలని ప్రజల, అధికారుల మన్నలను పొందాలని ఫ్రెండ్లీ పోలీసుగా ఉండాలని ఆకాంక్షించారు.

7న బహిరంగ వేలం

ప్రజాశక్తి-నందిగామ: నందిగామ మండలం అంబారుపేట గ్రామంలో సత్తెమ్మ తల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈనెల 7న టెండర్ కమ్ బహిరంగ వేలం పాటలు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఇఒ పవన్ కళ్యాణ్ గురువారం తెలిపారు. సోమవారం ఉదయం 11 గంటలకు కొబ్బరి చిప్పలు పోగు చేసుకునే హక్కు, ఆలయం వద్ద లడ్డు ప్రసాదం , బ్రహ్మోత్సవాలు పండుగలకు అవసరమైన కిరాణా సరుకులు, శానిటరీ సామాను సరుకులు వగైరా సరఫరా చేయుటకు జరుగు సీల్డ్ టెండర్ కం బహిరంగ వేలం పాటలో ఆసక్తి గలవారు పాల్గొనాలని ఆలయ ఇన్చార్జి ఈవో పవన్ కళ్యాణ్ ఒక ప్రకటనలో తెలిపారు. మిగిలిన వివరాలకు ఆలయం వద్ద సంప్రదించాలని ఈవో కోరారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ప్రవేశాలు పెంచాలి : డిఇఒ

మాట్లాడుతున్న డిఇఒ రామారావు

ప్రజాశక్తి-పామర్రు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచడమే లక్ష్యంగా ఎంఈఓల పర్యవేక్షణలో సిఆర్పిలు పనిచేయాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి. రామారావు అన్నారు. గురువారం పామర్రు ఎంఈఓ కార్యాలయాన్ని ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు సీఆర్పీలతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇఒ ఈ నెల 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించే పిటిఎం సమావేశాలు విజయవంతం చేసేందుకు క్షేత్రస్థాయిలో అధికారులకు దిశా నిర్దేశాలు చేశారు. గ్రామాల్లో సామాజిక సేవా సంస్థలు,ఎన్జీవోలు తదితర వర్గాలతో సమన్వయం చేసుకుని ఎన్రోల్మెంట్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. బడిఈడు పిల్లలు పనుల్లోకి వెళ్ళకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించే బాధ్యత సిఆర్పిలదేనన్నారు. జిల్లావ్యాప్తంగా1800 ప్రభుత్వ ప్రైవేటుపాఠశాలల్లో తల్లిదండ్రుల(పేరెంట్స్ కమిటీ) సమావేశాలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నా మన్నారు. మధ్యాహ్నం భోజనం పథకం లో మెనూ సక్రమంగా అమలు జరిగేలా సంబంధిత ప్రధానోపాధ్యా యులు పర్యవేక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలోఎంఈఓ 1.బొడ్డు శ్రీనివాసరావు, ఎంఈఓ 2.జి పద్మవాణి పాల్గొన్నారు.

పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి కలక్టరేట్ (కృష్ణా) : పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరుతూ యుటిఎఫ్, కృష్ణా జిల్లా శాఖ ఆద్వర్యంలో గురువారం జిల్లా విద్యాశాఖాధికారి పి వి జె రామారావు, కలక్టరేట్ ఏఒలకు వినతిపత్రం అందజేశారు. కృష్ణాజిల్లాలో త్వరితగతిన హైస్కూల్ ప్లస్లో గల ఖాళీలు భర్తీ చేయాలని కోరారు. అలాగే ఐచ్ఛిక సెలవులు మంజూరు విషయంలో పాఠశాల యూనిట్ లేదా వ్యక్తిగతంగా వినియోగించుకోవాలో స్పష్టం చేయాల న్నారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో రాష్ట్ర కార్యదర్శి కె ఎ

వినతిపత్రం అందిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు ఎం డి షౌకత్ హుస్సేన్, బి కనకారావు, జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు జె ప్రసాదరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు పి రవి వరప్రసాద్,కె రంగనాథ్ తదితరులు ఉన్నారు.

స్మార్ట్ మీటర్లను ప్రభుత్వం ప్రోత్సహించడం తగదు : సిపిఐ

ప్రజాశక్తి - గుడివాడ : భారత కమ్యూనిస్టు పార్టీ నూరు వసంతాల నుండి పేద వర్గాల కోసం, కార్మిక, కర్షకుల కోసం నిరంతరం పోరాటాలు చేస్తుందని సిపిఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు అన్నారు. గురువారం స్థానిక గుడివాడ క్లబ్ రోడ్‌లోని విడిది ఫంక్షన్ హాల్‌లో గుడివాడలో సిపిఐ గుడివాడ నియోజకవర్గ 23వ మహాసభను నియోజవర్గ కార్యదర్శి గూడపాటి ప్రకాష్‌బాబు, సహాయ కార్యదర్శి చింతలూరి సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా సిపిఐ జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు, జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నార్ల మాట్లాడుతూ దేశంలో బిజెపి పాలన వచ్చిన తరువాత ఆదాని కంపెనీకి అమ్ముడు పోయి, దేశాన్ని కార్పొరేటు

చేతుల్లో తీసుకెళ్లారన్నారు. గతంలో ఆదాని స్మార్ట్ మీటర్ల విషయంలో పోరాటం చేసిన చంద్రబాబు నేడు స్మార్టు మీటర్లును ప్రోతహిస్తున్నారన్నారు. ఈ నెల 8,9 తేదీలలో గన్నవరంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు. ఈ మహా సభలో వివిధ కార్మిక సంఘాల నాయకులు ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఎండి షాదిక్, దుప్పల వెంకటనరసింహారావు, పి.రంగా రావు, పి.శేషు, డి.శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

5న మెగా లోక్ అదాలత్

ప్రజాశక్తి-నందిగామ: కోర్టు, పోలీసుల సమన్వయంతో జూలై 5వ తేదీన నిర్వహించే మెగా లోక్‌అదాలత్ ను విజయవంతం చేయాలని నందిగామ అదనపు 16 వ అదనపు జిల్లా మరియు సెషన్ జడ్జి పి శ్రీనివాసరావు పేర్కొన్నారు. గురువారం పోలీసులతో మెగా లోక్ అదాలత్ పై జడ్జి పి శ్రీనివాసరావు సమీక్ష జరిపారు. కోర్టు, పోలీసుల సమన్వయంతో 5వ తేదీన నిర్వహించే మెగా లోక్‌అదాలత్ ను విజయవంతం చేయాలని కోరారు. న్యాయాధికారి స్టేషనల వారీగా ఉన్న పెండింగ్ కేసులపై ఆరాతీశారు. వీటిలో రాజీకి వచ్చే కేసులన్నీ లోక్‌అదాలతలో పరిష్కరించాలన్నారు. దీర్ఘకాలంగా కోర్టుల చుట్టూ తిరుగుతూ ఆర్థికంగా చితికిపోయిన ఇరువర్గాల కక్షిదారులను పిలిపించి వారితో మాట్లాడి పరిష్కారానికి మార్గం చూపాలన్నారు. చిన్నపాటి తగాదాలు, ఆర్థిక లావాదేవీలు, భార్యాభర్తల మధ్య మనస్పర్థలు, భూతగాదాల కేసులను పరిష్కార మయ్యేలా చూడాలన్నారు. 16 వ అదనపు జిల్లా , సెషన్స్ కోర్టు న్యాయమూర్తి పి శ్రీనివాసరావు, న్యాయవాది టీ వీ ఎస్ శర్మ, నందిగామ సిఐ నాయుడు ,నందిగామ రూరల్ సిఐ డి చవాన్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

సోనీ బ్రావియా సౌండ్‌బార్లు విడుదల

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సోనీ బ్రావియా థియేటర్ బార్ 6 (వైర్‌లెస్ సబ్ వూఫర్‌తో 3.1.2 ఛానెల్ సౌండ్‌బార్), బ్రావియా థియేటర్ సిస్టమ్ 6 (వైర్‌లెస్ రియర్ స్పీకర్‌లతో 5.1 ఛానెల్ హోమ్ థియేటర్ సిస్టమ్) విడుదల చేయటం ద్వారా సోనీ తమ బ్రావియా థియేటర్ పోర్ట్‌ఫోలియోను విస్తరించింది అని సోనీ మేనేజింగ్ డైరెక్టర్ సునీల్ నాయర్ ఒక ప్రకటనలో తెలిపారు. సినిమాటిక్ ఆడియోను ఇంటికి తీసుకురావడానికి రూపొందించబడిన ఈ సౌండ్‌బార్‌లు శక్తివంతమైన సరౌండ్ సౌండ్, సౌకర్యవంతమైన బ్రావియా టీవీ ఇంటిగ్రేషన్, ప్రతి సినిమా, గేమ్, కచేరీ అనుభవాన్ని అందిస్తుందని అన్నారు . ఇంటెలిజెంట్ సౌండ్ టెక్నాలజీలను కూడా అందిస్తాయని తెలిపారు. సోనీ బ్రావియా థియేటర్ సిస్టమ్ 6, బార్ 6లతో, గృహాలలో నిజంగా సినిమాటిక్ అనుభవాన్ని అందిస్తున్నామని తెలిపారు. ఈ ఉత్పత్తులు అత్యుత్తమ సాంకేతికత, ఆవిష్కరణలను అందిస్తాయన్నారు డాల్బీ అట్మాస్, వైర్‌లెస్ సౌలభ్యంతో పాటు శక్తివంతమైన వెయ్యి వాట్ లీనమయ్యే శబ్ద అనుభవాన్ని అందిస్తున్నాయి.అని తెలిపారు .భారతీయ వినియోగదారులు మరింత గొప్ప ఆడియో విజువల్ అనుభవాలను డిమాండ్ చేస్తున్నందున, ఈ శ్రేణి ప్రీమియం హోమ్ ఎంటర్‌టైన మెంట్ విభాగంలో కొత్త ప్రమాణాలను ఏర్పాటు చేస్తుందని మేము విశ్వసిస్తున్నామని అన్నారు.

అంతర్జాతీయ ఖోఖో పోటీలకు న్యాయనిర్ణేతగా మడకా ప్రసాద్

ప్రజాశక్తి - గుడివాడ : ఇటీవల న్యూఢిల్లీలో అత్యంత ప్రతిష్టాత్మ కంగా జరిగిన అఖిల భారత ఖో-ఖో సంఘ ఎన్నికలలో గుడి వాడకు చెందిన విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు మడకా ప్రసాద్‌ను అంతర్జాతీయ ఖో-ఖో న్యాయ నిర్ణేతగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈమేరకు ప్రసాద్ గురువారం ఒక ప్రకటనలో తన ఎన్నికపట్ల ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశంలోని వివిధ రాష్ట్రాల ఖో-ఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యని ర్వాహక సభ్యులు తనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. ఖో-ఖో సంఘ కార్య నిర్వాహక సభ్యులుగా 2025 నుండి 2029వ సంవత్సరం వరకు పదవిలో కొనసాగనున్నట్లు తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర ఖో-ఖో సంఘ అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్ , సీతారామిరెడ్డి, కష్ణా జిల్లా సంఘ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మద్దినేని సత్యప్రసాద్‌లకు ధన్యవాదాలు తెలిపారు.

ఎంఆర్‌పిఎస్ జెండా దిమ్మెకు శంకుస్థాపన

ప్రజాశక్తి-గన్నవరం : ఎమ్మార్పీఎస్ అధినేత, పద్మశ్రీ మందకష్ణ పిలుపు మేరకు జులై 7న అన్ని గ్రామాలలో సమాజంలోని అందరినీ కలుపుకొని జండా ఆవిష్కరణ చేయాలని గన్నవరం నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఎంఎస్పీ బాధ్యులు మంద వేణు కోరారు. గురువారం బి బి గూడెంలో ఎమ్మార్పీఎస్ జెండా దిమ్మ శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడుతూ మాట్లాడుతూ 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటానికి సమాజంలోని ప్రతి ఒక్కరు సహకారంతోనే వర్గీకరణ సాధించి 31 వ సంవత్సరంలో అడుగుపెడుతున్నామని అన్నారు. ఈ కార్యక్ర మంలో బిబిగూడెం ఉపసర్పంచ్ ధర్మారావు, ఎమ్మార్పీఎస్ కష్ణాజిల్లా అధికార ప్రతినిధి కోటా కష్ణ మోహన్ మాదిగ, ఎమ్మార్పీఎస్ గన్నవరం మండలం దొండపాటి ఇంచార్జ్ శేఖర్ మాదిగ, ఎమ్మార్పీఎస్ నాయకులు గోడవర్తి నాగేశ్వరావు పాల్గొన్నారు

కొనసాగుతున్న 'ఇంటింటికీ సుపరిపాలన'

ప్రజాశక్తి - గుడివాడ : కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమేకాక పెద్ద ఎత్తున అబివృద్ధి కార్యక్రమాలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. గురువారం పట్టణంలోని 1, 36 వార్డుల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సుపరిపాలనకు తొలి అడుగు ఇంటింటి ప్రచారాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఆర్యవైశ్య కార్పొరేషన్ డైరెక్టర్ గోకవరపు సునీల్, టిడిపి పట్టణ అధ్యక్షుడు దింట్యాల రాంబాబు, ఎన్‌టిఆర్ స్టేడియం కమిటీ వైస్ చైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు పాల్గొన్నారు.**ప్రజాశక్తి-గన్నవరం :** రాష్ట్రవ్యాప్తంగా గ్రామపంచాయతీలలో అభివద్ధి పనుల కోసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ సంవత్సర కాలంలో వెయ్యి కోట్ల రూపాయల నిధులు కేటాయించినట్లు ప్రభుత్వ విప్, గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు తెలిపారు. విజయవాడ రూరల్ మండలం గూడవల్లి గ్రామంలో గురువారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పర్యటించిన యార్లగడ్డ ఇంటింటికి తిరుగుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు.ఈ సందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ తాను ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తరువాత సంవత్సర కాలంలో గన్నవరం నియోజకవర్గంలో రూ. 614 కోట్ల ఖర్చుతో అభివద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టినట్లు చెప్పారు. గన్నవరం నియోజకవర్గ అభివద్ధి ధ్యేయంగా ముందుకు సాగుతున్నట్లు వివరించారు. టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు జొన్నలగడ్డ శ్రీనివాస్, యూనిట్ ఇన్ ఛార్జ్ సొంగ సంతోష్ కుమార్, బి ఎలా ఏ సొంగ చంద్ర శేఖర్ బాబు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కంకిపాడు :** సుపరిపాలనలో తొలి అడుగు పేరుతో అద్భుతమైన కార్యక్రమానికి పెనమలూరు నియోజకవర్గ శాసనసభ్యులు బోడె ప్రసాద్ శ్రీకారం చుట్టారని కంకిపాడు మండల టిడిపి సీనియర్ నాయకులు యలమంచిలి కిషోర్ బాబు అన్నారు. గురువారం ఆయన కంకిపాడులో ఇంటింటికి తిరుగుతూ, కూటమి ప్రభుత్వ విజయాల కరపత్రాలను పంపిణీ చేశారు.

ఆయాపై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి

ప్రజాశక్తి-తిరువూరు: విస్సన్నపేట మండలం రామానగరం దళితపేటలోని అంగన్వాడి కేంద్రంలో పనిచేస్తున్న ఆయా నాగమణిపై దాడి చేసి గాయపరిచిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలని సిఐటియు ఆధ్వర్యంలో అంగన్వాడి వర్కర్లు తిరువూరులోని ఐసిడి ఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి బి.వెంకటేశ్వరావు మాట్లాడుతూ డ్యూటీలో ఉండి విధులు నిర్వర్తిస్తున్న ఆయా కొమ్ము నాగమణిని అదే కాలనీకి చెందిన కొమ్ము చిన్నోడు, అతని కుటుంబ సభ్యులు దుర్భాషలాడి విచక్షణార హితంగా కొట్టి గాయపరిచి మూడు రోజులవుతున్నా పోలీసులు ఇంతవరకు వారిని అరెస్టు చేయకపోవడం బాధాకరమన్నారు. ఆయాను గాయపరచిన వారిని తక్షణమే అరెస్ట్ చేసి ఆమెకు మెరుగైన వైద్యం అందించాలని వెంకటేశ్వరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్ష కార్యదర్శులు పద్మ, నాగమణి, స్వాతి, వరలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు పూడ్చివేత

ప్రజాశక్తి-రెడ్డిగూడెం : రెడ్డిగూడెం మండల కేంద్ర శివారు కొత్త రెడ్డిగూడెం రామాలయం వద్ద విజయవాడ – విస్సన్నపేట ఆర్అండ్‌బి రోడ్డుపై పడిన గుంతను పూడ్చేందుకు గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు

చర్యలు తీసుకున్నారు. 'చెరువును తలపిస్తున్న ఆర్ అండ్ బీ రహదారి' అనే శీర్షికతో బుధవారం ప్రజాశక్తి దినపత్రికలో వచ్చిన వార్తకు స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి రామారావు గురువారం 30 టన్నులు కంకర జీఎస్బీ మిక్సర్‌తో పంచాయతీ పరిధిలోని ఆర్ అండ్ బి రోడ్డుపై ఉన్న గుంతలను పూడ్చి రాకపోకలకు అంతరాయం లేకుండా చేశారు. కానీ ఇదే రోడ్డు పై అధిక లోడుతో వాహనాలు ప్రయాణం చేస్తే సమస్య మొదటికి వచ్చే అవకాశం ఉంది. ఆర్అండ్‌బి వారు పూర్తి స్థాయిలో ఈ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

టొయోటా సర్వీస్ క్యాంపెయిన్ ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ అర్బన్: సర్వీస్, టైర్లు, ఉపకరణాలు, మరిన్నింటిపై అద్భుతమైన ఆఫర్‌లతో టొయోటా సర్వీస్ క్యాంపెయిన్‌ను ప్రారంభించినట్లు టయోటా హెడ్ జె.రాజేష్ ఒక ప్రకటనలో తెలిపారు. అధీకృత టొయోటా డీలర్ షిప్‌లలో ప్రారంభమైన ఈ కార్యక్రమం, వర్షాలకు మీ వాహనాన్ని సిద్ధం చేయడం, ఇంటీరియర్‌లను రిఫ్రెష్ చేయడం, టైర్, బ్యాటరీ తనిఖీలతో సజావుగా ప్రయాణించేలా చేయడానికి ఉపయోగపడుతుందని అన్నారు. ఈ వర్షాకాలంలో రోడ్డుపై సురక్షితంగా, సౌకర్యవంతంగా ప్రయాణించటానికి తోడ్పడుతుందని తెలిపారు. టైర్, బ్యాటరీ పరీక్షతో 20 పాయింట్ల ఉచిత వాహన తనిఖీ, లేబర్ ఛార్జీలపై 10 శాతం వరకు తగ్గింపు ఇవ్వనున్నట్లు తెలిపారు, టి గ్లోస్ మాన్సూన్ కేర్ ప్యాకేజీపై 10 శాతం తగ్గింపు, ఇంటీరియర్ క్లీనింగ్, విండ్‌షీల్డ్ పాలిష్, హెడ్‌ల్యాంప్ పునరుద్ధరణ, వాసన తటస్థీకరణను ఈ క్యాంపెయిన్ కలిగి ఉంటుంది అని తెలిపారు. వర్షాకాలంలో సరైన దృశ్యమానత, పరిశుభ్రత, సౌకర్యాన్ని నిర్ధారిస్తుంది అని తెలిపారు, టైర్లు, బ్యాటరీలపై ఆకర్షణీయమైన ఆఫర్‌లు లభిస్తాయని, ఈ కార్యక్రమం ఈ నెలాఖరు వరకు కొనసాగుతుందన్నారు.

నిబంధనలు పాటించని క్వారీ యజమానులపై చర్యలు : కలెక్టర్

ప్రజాశక్తి-కంచికచర్ల

నిబంధనలు పాటించని క్రషర్లు సీజ్ చేయటంతో పాటు, సంబంధించిన క్వారీలు వీధులను రద్దుచేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీష అన్నారు. కంచికచర్ల మండలం పరిటాల పరిధిలో నిబంధనలు పాటించని క్రషర్, క్వారీ లో నుండి వచ్చే దుమ్ము ధూళి వల్ల పంట పొలాలు నాశనమౌతున్నారని, అదేమని అడిగితే క్రషర్, క్వారీ రజమానులు వేధిస్తున్నారని బాధిత రైతులు క్షషర్లకు వెళ్ళే రోడ్డులో రెండు రోజులుగా నిరసన కార్యక్రమం చేస్తున్న విషయం తెలిసిందే. గురువారం కంచికచర్ల మండలంలో ఓ కార్యక్రమంలో పాల్గొనేందుకు వెస్తున్న జిల్లా కలెక్టర్ లక్ష్మీష రైతులు చేపట్టిన నిరసన శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా బాధిత రైతులు క్రషర్, క్వారీలు నుండి వచ్చే దుమ్ము ధూళి వల్ల పంటలు పండక తీవ్రంగా

సమస్యలు కలెక్టర్‌కు వివరిస్తున్న బాధిత రైతులు

నష్టపోతున్నామనీ, దీనికీ తోడు ప్రశ్నించిన రైతులను క్వారీ, క్రషర్ యజమానులు వేధిస్తున్నారని కలెక్టర్ దష్టికి తీసుకెళ్లారు. అలాగే కొందరు ఎన్ ఎస్ పి కాలువ పూడ్చి ఆక్రమించి, క్రషర్ నిర్మించారని, తెలిపారు. దీనికి స్పందించిన కలెక్టర్ అనుమతులు ఉన్నప్పటికి నిబంధనలు పాటించని క్రషర్ లను సీజ్ చేయటంతో పాటు, క్వారీలు వీధులను రద్దుచేసి సంబంధించిన వ్యక్తులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఎన్ ఎస్ పి కాలువ పూడ్చిన, దారిలో కట్టిన క్రషర్ లను తొలగిస్థామన్నారు. కాలుష్యం సమస్యలు పెంచి సంబంధించిన శాఖ దష్టికి , ఇతర సమస్యలు ప్రభుత్వం దష్టికి తీసుకువెళ్లి సమస్యలు పరిష్కారానికి కషి చేస్తానని రైతులకు హామీ ఇచ్చారు. నిబంధనలు పాటించని క్రషర్,, క్వారీలను గుర్తించి, తక్షణం నివేదిక అందిజేయాలని సంబంధించిన అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అనంతరం రైతులు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టర్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్డీవో బాలకష్ణ, తహాశీల్దార్ పీహెచ్ నలశింహారావు ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎంఎల్‌ఎ ఒత్తిడితోనే సిపిఎం నాయకులపై కేసులు

సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఆంజనేయులు

మాట్లాడుతున్న ఆంజనేయులు

ప్రజాశక్తి-మైలవరం: ప్రజల పక్షాన నిలబడి అధికార పక్షాన్ని ప్రశ్నిస్తున్నారని స్థానిక ఎమ్మెల్యే పోలీసులపై ఒత్తిడి తీసుకువచ్చి సిపిఎం మండల కార్యదర్శిపై కేసులు పెడుతున్నారని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పివి ఆంజనేయులు అన్నారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మైలవరం నుండి నూజివీడు వెళ్లే రోడ్డు అధ్వానంగా ఉండటంతో స్థానికుల ఇబ్బందులను గమనించి సిపిఎం మైలవరం మండల కమిటీ ఆధ్వర్యంలో వెల్వడం, గణపవరం, చంద్రాల గ్రామస్తులతో కలిసి నిరసన కార్యక్రమం చేపట్టే క్రమంలో పోలీసులు దురుసుగా ప్రవర్తించారన్నారు. సిపిఎం మండల కార్యదర్శి సుధాకర్‌ను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉంచటం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. సమస్యలు పరిష్కరించాలని ప్రజల పక్షాన పోరాటం చేస్తుంటే కేసులు పెడతారా అంటూ పోలీసుల తీరును దుయ్యబట్టారు. గతంలో ప్రజల తరపున చేసిన ఉద్యమ కేసులను కలిపి నేర చరిత్ర కలిగిన వారిగా చూపుతూ బైండోవర్ కేసు పెట్టడం దుర్మార్గమని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించలేని వారికి పోరాటాలు చేసే వారిపై కేసులు పెట్టే హక్కు ఎవరిచ్చారని ప్రశ్నించారు. ఉన్నతాధికారులు స్పందించి తప్పుడు కేసులు పెట్టిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, సిపిఎం నాయకులపై బనాయించిన కేసులను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి సిహెచ్ సుధాకర్, మండల కమిటీ సభ్యులు వజ్రాల వెంకటరెడ్డి, రావుల సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌వి రంగారావు జయంతి

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: తన విలక్షణమైన నటనతో ప్రజల గుండెల్లో నిలిచిన మహనీయుడు ఎస్వీ రంగారావు అని జనసేన పార్టీ నాయకురాలు తిరుపతి అనూష కొనియాడారు. ప్రఖ్యాత తెలుగు చలనచిత్ర నటుడు, నాటక రంగ శిల్పి ఎస్వీ రంగారావు జయంతి కార్యక్రమాన్ని భవానీపురంలోని అనూష కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ విజయవాడ ప్రచార కమిటీ కోఆర్డినేటర్ తిరుపతి సురేష్, పార్టీ నాయకులు, జనసైనికులు పాల్గొని ఎస్వీ రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన జీవిత విశేషాలు, నటనలో చూపిన నైపుణ్యం గురించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో మంతాపురం రాజేష్, శ్యాంసుందర్, ఆదిత్య రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అన్నప్రసాదానికి విరాళం

ప్రజాశక్తి-విజయవాడ సిటీ: దుర్గగుడి నిత్యాన్నదాన పథకానికి ఒంగోలుకు చెందిన ప్రముఖ పారిశ్రామికవేత్త, మాజీ మంత్రి సిద్దా రాఘవరావు రూ.1.01 లక్షలు విరాళంగా కార్యనిర్వాహణాధికారి వి.కె.శీనానాయక్‌కి గురువారం అందజేశారు. ఈ సందర్భంగా దాతకు అమ్మవారి దర్శనం, ఆశీర్వచనం ఏర్పాటు చేసి, చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

శ్రీనిధి విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-తిరువూరు: ఫిబ్రవరి నెలలో దక్షిణ భారత హిందీ ప్రచార సభ నిర్వహించిన పరీక్షలలో తిరువూరు శ్రీనిధి పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు మండల ప్రథమ, ద్వితీయ స్థానాలలో ఉత్తీర్ణత సాధించారు. ప్రాథమిక పరీక్షలో ప్రథమ స్థానం షేక్ అఫ్రీన్ (7వ తరగతి), మధ్యమ పరీక్షలో ప్రథమ స్థానం షేక్ హర్షియా (4వ తరగతి), ద్వితీయ స్థానం విష్ణుప్రియ (6వ తరగతి) పి.శ్రీరామ (5వ తరగతి), రాష్ట్ర భాష పరీక్షలో ప్రథమ స్థానం వి.షణ్ముఖ వర్షిని (8వ తరగతి), ద్వితీయ స్థానం జై.హాసిని (8వ తరగతి), ప్రవేశిక పరీక్షలో ద్వితీయ స్థానం టి.జోన్ దేవ్ నాగ్ (8వ తరగతి), విశారద పూర్వార్థ పరీక్షలో ప్రథమ స్థానం ఏ.వోజశ్విత (9వ తరగతి), ద్వితీయ స్థానం

ఏ.నాగపుత్రిక (9వ తరగతి) బి.సాత్విక్ (8వ తరగతి) ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపల్ వెంకటనారాయణ తెలిపారు. విద్యార్థులను శిక్షణను ఇచ్చిన హిందీ ఉపాధ్యాయుడు షేక్ బాజీ, హిందీ ప్రచార సభ అధ్యక్షులు కె.రఘునందన్, పాఠశాల కరస్పాండెంట్ ఎం కిషోర్‌బాబు అభినందించారు.

మోకాళ్లపై నిలబడి ఇంజినీరింగ్ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-విజయవాడ: మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో మునిసిపల్ ఇంజినీరింగ్ కార్మికుల చేపట్టిన సమ్మె గురువారం నాటికి తొమ్మిదో రోజుకు చేరుకుంది. ఆయా సెక్షన్లలోని కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని నడుముకు వేపాకు కట్టుకొని మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు. కార్మికులనుద్దేశించి యూనియన్ నగర గౌరవాధ్యక్షులు దోనేపూడి కాశీనాథ్ మాట్లాడుతూ వందలాది మంది కార్మికులు వీధుల్లోకి వచ్చి సమ్మె చేస్తున్నా, పౌరసేవలు స్తంభించిపోయినా, ప్రజలు ఇబ్బందులు పడుతున్నా ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని దుయ్యబట్టారు. శుక్రవారం విజయవాడలో పెద్ద బహిరంగ సభ నిర్వహించి, తదుపరి శనివారం నుంచి ఉద్యమం ఉధృత రూపం దాల్చేందుకు రూపకల్పన చేయడం జరుగుతుందన్నారు. పారిశుధ్య కార్మికులు కూడా ఈ సమ్మెకు సంపూర్ణ మద్దతునిస్తున్నారని అన్నారు. కార్మికులు పనిని బట్టి ప్రతిఫలం కోరుతున్నారు తప్ప అదనపు సాయం కోరడం లేదన్నారు. సంక్షేమ పథకాల అమలు, గత 17 రోజుల సమ్మె కాలపు జీవో కాపీల అమలు కోసం ఇంజనీరింగ్ కార్మికులకు మద్దతుగా పారిశుధ్య , డ్రైనేజీ, వెహికల్ డిపో డ్రైవర్లు క్లీనర్లు, కార్మికులు కూడా విజయవాడ ధర్నా చౌక్‌కు తరలిరావాలని, బహిరంగ సభను జయప్రదం చేయాలని

మోకాళ్లపై నిలబడి నిరసన తెలుపుతున్న కార్మికులు

కోరారు. ఈ కార్యక్రమంలో నగర అధ్యక్షుడు జ్యోతిబసు, నగర కోశాధికారి స్టీఫెన్ బాబు, వాటర్ సెక్షన్ బాధ్యులు దుర్గారావు, నారాయణ, నల్ల శ్రీను, సైదులు, పార్కు సెక్షన్ బాధ్యులు టీ చిన్న, వెంకట్రావు స్వరూప, నగర ఆర్గనైజింగ్ కార్యదర్శి టి ప్రవీణ్, నగర కమిటీ సభ్యులు మన్నే బుజ్జమ్మ పాల్గొన్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం... ప్రజల పక్షం

పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ, జయంతి, వర్ధంతి, శ్రద్ధాంజలి మరియు లీగల్ మొదలగు అన్నిరకాల ప్రకటనలకై...

మీ బంధు మిత్రులకు తక్కువ సమయంలో సమాచారం తెలపాలంటే తక్కువ ఖర్చుతో ప్రకటనలకై మీ సమీపంలోని ప్రజాశక్తి కార్యాలయంలో గానీ లేదా క్రింది నెంబర్‌కు గానీ సంప్రదించగలరు.
సెల్ నెం: 94900 99530, 94900 99218

విజ్ఞప్తి
స్థానిక వార్తలతో పాటు, జాతీయ, అంతర్జాతీయ వార్తలు, విశ్లేషణల సమాహారం... ప్రజాశక్తి. చందా దారులుగా చేరండి.
94900 99218, 9490099530 నెంబర్లను సంప్రదించండి.